నేటి కందం- నేటికి అందం
చేకూర్చగ జయములను వి
వేకము గలిగింప "పవన విద్యుత్తు" పయిన్
శ్రీకరుడై"మోడీ" ప
ద్మాకరుడై "మనసు లోని మాట"ను నుడివెన్ !!
("పవన విద్యు దుత్పత్తి"లో భారతదేశం ప్రపంచంలోనే నాలుగవ స్థానం సాధించిందని ప్రధాని"నరేంద్ర మోడీ"ఆకాశవాణి లో తన "మనసు లోని మాట "లో వివరించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


చురక
మహానేతే అతడు నేడు
మరమనిషిగా మారిందట
గుంటనక్కలతని మనసు
గుంభనంగా మార్చిండ్రట.
తనయ నేడు బయటకొచ్చి
తండ్రి పార్టీ అవినీతనే
తాను దాంట్లో మునిగి తేలి
తనదే స్వచ్ఛ నీతి అనే

-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 28-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:201 పేజీలు:6 వెల: రూ.1/-

## కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థి మాత్రమే.. శత్రువు కాదు: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 27: మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యంపై తాను ఎప్పుడూ నెగటివ్‌గా ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, శత్రువు కాదని అన్నారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉ ఒడటం తనకే మంచిదని, రాజకీయంగా ఎదుర్కోవడం సులభమవుతుందని వ్యాఖ్యానించారు. విశ్రాంతి తీసుకుంటున్న ప్రజా ప్రతినిధి గురించి చెడు కోరుకోవడం తన స్వభావం కాదని తెలిపారు. కేసీఆర్‌కు గాయమైనప్పుడు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించానని, అసెంబ్లీకి వచ్చినప్పుడు కూడా ఆయన్ను కలిసి యోగక్షేమాలు అడిగానని రేవంత్ రెడ్డి తెలిపారు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా గౌరవం ఉందని పేర్కొన్నారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ బతికి ఉంటే తమకు అధికారం రాదని ఆయన కుటుంబ సభ్యులే భావిస్తున్నారని వ్యాఖ్యానించారు.

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేటీఆర్ ముఖ్యమంత్రి కావాలని మంత్రులతో ప్రకటనలు చేయించారని ఆరోపించారు. అధికార పంపకాల విషయంలో తేడాలు రావడంతో కుటుంబంలో విభేదాలు వచ్చాయని అన్నారు. అయితే, వాళ్లంతా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. అనుబంధ సంఘాలను ప్రభుత్వంపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసీఆర్‌కు ఓటమి కొత్తేమీ కాదు..

కేసీఆర్‌ను ఇప్పటికే రెండు సార్లు ఓడించానని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు ఓటమి కొత్త విషయం కాదని, అలాగే గెలుపు కాంగ్రెస్



పార్టీకి కొత్త కాదని అన్నారు. మహేష్ గౌడ్ వర్సెస్ కేసీఆర్‌గా జరిగిన స్థానిక సంస్థల పోరులో కూడా కేసీఆర్ ఓటమి చవిచూశారని గుర్తు చేశారు. తాము వివక్ష లేకుండా ప్రభుత్వం నడుపుతున్నామని, అన్ని వర్గాల ప్రజలకూ సమన్యాయం చేస్తూ పాలన కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## అంబర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం..

హైదరాబాద్, ఏప్రిల్ 27:: అంబర్‌పేట్ చౌరస్తాలోని రెనో, మహీంద్ర షోరూమ్స్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు భారీగా ఎగిసిపడుతున్నాయి. ప్రమాదాన్ని పసిగట్టిన వెంటనే షోరూమ్ యజమానులు.. అగ్నిమాపక సిబ్బందితోపాటు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది.. మంటలార్పుతున్నారు. ప్రమాదానికి గురైన షోరూమ్స్ వెనుక వైపు గృహసముదాయాలు ఉన్నాయి. అగ్నికీలలు ఎగసిపడుతుండటం, ప్రమాద తీవ్రత అధికంగా ఉ ఒడటంతో.. షోరూమ్స్‌కి ఆనుకుని ఉన్న ఇళ్లలోని ప్రజలను ఖాళీ చేయించారు పోలీసులు.

అగ్ని ప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా.. షోరూమ్‌లోని వాహనాలన్నీ దగ్ధమయ్యాయని.. భారీగా ఆస్తి నష్టం కలిగిందని షోరూమ్ యజమానులు తెలిపారు.

## ఇప్పుడు వెళ్తున్నా.. మళ్లీ ఆరోజు తిరిగి వస్తా

కోల్‌కతా, ఏప్రిల్ 27: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత ప్రచారానికి మరి కొద్ది గంటల్లోనే తెరపడనుంది. ర్యాలీలు, రోడ్‌షోలతో విస్తృత ప్రచారం సాగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం నాడు బరాక్‌పూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. రాష్ట్రంలో బీజేపీ చక్కటి ఫలితాలు సాధిస్తుందనే నమ్మకం ఉందని చెప్పారు. బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయనుందనే సంకేతాలు ఇస్తూ, బీజేపీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మళ్లీ వస్తానని ప్రధాని తెలిపారు.

'ఈ ఎన్నికలకు సంబంధించి ఇదే నా చివరి ప్రచార ర్యాలీ. మే 4న ఫలితాలు వెలువడిన తర్వాత బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి కచ్చితంగా వస్తాననే నమ్మకంతో తిరిగి వెళుతున్నారు. హెలిపాడ్ నుంచి నేను రెండు కిలోమీటర్లు ప్రయాణం చేసి ఇక్కడకు వచ్చాను. దారికి రెండు వైపులా వేలాది మంది ప్రజలు బారులు తీరారు. ఇంత పొద్దున్నే జనం పెద్ద సంఖ్యలో నన్ను ఆశీర్వదించడానికి వస్తారని ఊహించలేదు' అని మోదీ ఆనందం వ్యక్తం చేశారు.

టీఎంసీపై విమర్శల దాడి

అధికార తృణమూల్ కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు



గుప్పించారు. టీఎంసీ పాలనలో రాష్ట్రంలో పారిశ్రామిక కార్యకలాపాలు తగ్గిపోయాయని, ఫ్యాక్టరీలు మూతపడ్డాయని, పశ్చిమబెంగాల్ భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన రోడ్‌మ్యాప్ టీఎంసీ ప్రభుత్వం వద్ద లేదని అన్నారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం అవసరం ఇక్కడ ఎంతైనా ఉందని, కేంద్ర-రాష్ట్రాల సమన్వయంతోనే వేగవంతమైన వృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. టీఎంసీ సిండికేట్ వ్యవస్థ భూస్థాపితం కావాలన్నారు, నిర్మాణాత్మక పాలనకు బదులు బెదిరింపులు, మోసపూరిత రాజకీయాలపైనే టీఎంసీ ఆధారపడిందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు ఏమాత్రం భద్రత లేదని, ప్రజావిశ్వాసాన్ని టీఎంసీ కోల్పోయిందని, అది గుర్తుంచుకుని మహిళా ఓటర్లు ఓటు వేయాలని కోరారు.

లండన్ తరహాలో కోల్‌కతాను అభివృద్ధి చేస్తామని టీఎంసీ గతంలో ఇచ్చిన హామీలను మోదీ ప్రస్తావిస్తూ, గత 15 ఏళ్లుగా కోల్‌కతా తన గుర్తింపును కోల్పోయిందని, అక్రమ చొరబాటుదారులు సిటీలో సెటిల్ అయ్యారని అన్నారు. నగర పూర్వ వైభవాన్ని పరిరక్షించేందుకు కోల్‌కతా వాసులంతా సమష్టిగా కృషి చేయాలని కోరారు. మెరుగైన శాంతి భద్రతల కోసం ఓటర్లు 'కమలం' గుర్తును ఎంచుకోవాలని కోరారు. సకాలంలో ప్రభుత్వ నియామకాలు జరుపుతామని, ఖాళీ ఉన్న పోస్టులు భర్తీ చేస్తామని, ఉద్యోగులకు 7వ వేతన కమిషన్ ప్రయోజనాలు చూకూరుస్తామని, జీరామ్‌జీ గ్రామీణ ఉపాధి పథకం అమలు చేస్తామని చెప్పారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలివిడత పోలింగ్ ఈనెల 23న జరుగగా, 29న తుది విడత పోలింగ్ జరుగనుంది. మే 4న ఫలితాలు వెలువడతాయి.

## నేను ఎవర్నీ రేప్ చేయలేదు: డోనాల్డ్ ట్రంప్



వాషింగ్టన్, ఏప్రిల్ 27: నేనేమీ రేపిస్టును కాదు, నేను ఎవర్నీ రేప్ చేయలేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. తాను పెడోఫైల్ కూడా కాదన్నారు. వైట్‌హౌజ్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో ట్రంప్‌ను టార్గెట్ చేస్తూ కోల్ టామస్ అల్లన్ అనే వ్యక్తి కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఆ ఘటన ముగిసిన తర్వాత సీబీఎస్ న్యూస్ ఛానల్‌కు ట్రంప్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూలో ఆయన ఈ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నిందితుడు అల్లెన్ రిలీజ్ చేసిన ఓ లేఖ ఆధారంగా టీవీ జర్నలిస్టు అడిగిన ప్రశ్నలకు ఆయన బదులు ఇచ్చారు.

ఓ సందర్భంలో ట్రంప్ తన సహనాన్ని కోల్పోయారు. అనుమానిత షూటర్ అల్లెన్ ఓ మ్యానిఫెస్టోను రిలీజ్ చేశాడు. దాంట్లో ట్రంప్ వైఖరిని తప్పుపట్టాడు. ట్రంప్‌ను రేపిస్టుగా, ఫెడోఫైల్‌గా అతను పేర్కొన్నాడు. ఆ ఆరోపణల గురించి టీవీ యాంకర్ తన ఇంటర్వ్యూలో ట్రంప్‌ను అడిగారు. దానికి ఆయన స్పందిస్తూ తానేమీ రేపిస్టు కాదు అని, పెడోఫైల్‌ను కాదన్నారు. షూటర్ అల్లెన్ ఓ ర్యాడికల్ అయ్యాడని, అతను క్రీస్తు వ్యతిరేకిగా మారాడని, ఆ నిందితుడు ఆరోగ్యం సరిగా లేదని ట్రంప్ అన్నారు.

షూటర్ మ్యానిఫెస్టోను జర్నలిస్టు నోరా ఓడొన్నల్ చదువుతున్న సమయంలో ట్రంప్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కానీ మీరు ఓ గమ్మత్తు మనుషులంటూ జర్నలిస్టుపై ట్రంప్ కామెంట్ చేశారు. ఆ షూటర్ మీ గురించే చెబుతున్నారని మీరు అనుకుంటున్నారా అని అడిగిన సమయంలో ఆ ప్రశ్నను దాటవేస్తూ.. తానేమీ పెడోఫైల్(పిల్లలను లైంగికంగా వేధించే వ్యక్తి) కాదన్నారు. షూటర్ మ్యానిఫెస్టో గురించి తనకు కూడా కొంత తెలిసిందని, అతను ర్యాడికల్‌లా మారాడని, తొలుత క్రైస్తవాన్ని నమ్మాడని, కానీ ఆ తర్వాత అతను క్రీస్తుకు వ్యతిరేకిగా మారినట్లు చెప్పారు. బహుశా అతని ఆరోగ్యం సరిగా లేదని భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.

డెమొక్రటిక్ నేతలు ఇస్తున్న విద్వేష ప్రసంగాలను కూడా ట్రంప్ తప్పుపట్టారు. ఆ ప్రసంగాలు చాలా ప్రమాదకరమైనవని, దేశంలో రాజకీయ హింసకు అదే కారణమన్నారు. డిన్నర్ పార్టీలో నిందితుడు కాల్పులు జరుగుతున్న సమయంలో ప్రధాన వేదికపై ఉన్నట్లు చెప్పిన ట్రంప్.. అయితే అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్న ఉత్సాహంతో ఉండిపోయినట్లు తెలిపారు. కాల్పుల శబ్దం వినిపించిన సమయంలో తానేమీ ఆందోళన చెందలేదని ట్రంప్ అన్నారు. జీవితం అంటే ఏంటో తనకు తెలుసు అని, మనం ఓ క్రేజీ ప్రపంచంలో జీవిస్తున్నామన్న వాస్తవాన్ని తెలుసుకోవాలన్నారు. గడిచిన రెండేళ్లలో మూడోసారి ట్రంప్‌పై హత్యాయత్నం జరిగింది.

## సహజీవనం తర్వాత కేసులు పెట్టడంపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:సహజీవనం తర్వాత అత్యాచారం కేసులు పెట్టడం సరికాదని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. బ్రేక్-అప్ తర్వాత లైంగిక దాడి ఆరోపణలు వర్తించవని పేర్కొంది. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం నేరం కిందకు రాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. మోదీ 'ఝల్ మురీ' తింటే.. మమతకు ఎందుకు కోపం వచ్చింది

పెళ్లి చేసుకోలేదని కక్షపూరితంగా కేసులు పెట్టడం సరికాదని ధర్మాసనం సూచించింది. తప్పుడు వాగ్దానం, విఫలమైన వాగ్దానాల మధ్య తేడాను గుర్తించాలని కేసు విచారణ సందర్భంగా పిటిషనర్‌కు తెలిపింది. ఈ మేరకు మహారాష్ట్ర న్యాయవాదిపై నమోదైన అత్యాచారం కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇద్దరి వ్యక్తుల బంధంలో ప్రారంభం నుంచీ మోసపూరిత ఉద్దేశం ఉంటేనే నేరం కిందకు వస్తుందని సుప్రీం కోర్టు ధర్మాసనం తెలిపింది.

## పామాయిల్ సాగుపై దృష్టి సారించాలి: మంత్రి తుమ్మల

ఖమ్మం జిల్లా, ఏప్రిల్ 27 : రైతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. అన్నదాతలు పామాయిల్ సాగుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈరోజు (సోమవారం) ఖమ్మం జిల్లాలో తుమ్మల నాగేశ్వరరావు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రఘునాథపాలెంలోని రైతువేదిక వద్ద రైతు ముగింట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. రైతులను అన్నివిధాలుగా ఆదుకోవాలని శాస్త్రవేత్తలంతా కూడా గ్రామంలో ఉంటున్నారని తెలిపారు. రైతులకు యంత్రాలు అందజేయాలని



తాము చూస్తున్నామని అన్నారు.

ఎప్పుడు ఏ విత్తనం వేయాలో.. ఏ కాలంలో ఏ విత్తనం వేస్తే మంచిదనే విషయాలను శాస్త్రవేత్తలు చెబుతారని తెలిపారు. పామాయిల్ కూడా పండించాలని.. రఘునాథపాలెం మండలం తెలంగాణలోనే నంబర్ వన్‌గా ఉ ఒడాలని ఆకాంక్షించారు. పామాయిల్ సాగుకు సబ్సిడీ, రైతుబంధు వస్తోందని స్పష్టం చేశారు. పామాయిల్ పంట వేస్తే అంతరపంటలు వేయ్యొచ్చని... రైతులు ఎక్కడ కష్టపడొద్దని చెప్పుకొచ్చారు. కేంద్రప్రభుత్వం పెట్రోల్ కొరత తీసుకువస్తోందని.. తెలియకుండా రేట్లు పెంచుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై కేసీఆర్ ఆగ్రహం



హైదరాబాద్, ఏప్రిల్ 27:బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలోనే ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా 16మంది రాష్ట్ర ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుపకుండా మౌనంగా ఉన్నారని.. అదే పార్లమెంట్‌లో మన ఎంపీలు ఉండుంటే తేజస్వి సూర్య మాట్లాడిన మాటలకు రణరంగం చేసేవాళ్లు అని పార్టీ అంతర్గత సమావేశంలో అభిప్రాయపడ్డారు.

ఈ 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణలో పుట్టలేదా? వాళ్లకు తెలంగాణ పౌరుషం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీ తేజస్వి సూర్య అనే వెధవ మాట్లాడిన మాటలను ఎందుకు ఎండగట్టలేదని నిలదీశారు. అదే ఒక్క బీఆర్ఎస్ ఎంపీ ఉన్నా పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పించేటోళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండి పౌరుషంగా లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు.

ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయ రంగం నుంచి ఇతర అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలబెట్టామని కేసీఆర్ తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం భూముల కబ్జాల్లో నంబర్‌వన్, కూలగొట్టడంలో నంబర్‌వన్‌గా నిలబట్టే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయలేని స్థితిలో చేతకానితనంతో ఉన్నదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లు లేకపోవడం వల్ల రైతన్నలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే తీవ్రంగా బాధ అవుతుందని అన్నారు. చిల్లర కూతలు, చిల్లర మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, మంత్రులను చూస్తే జాలి వేస్తుందని అన్నారు.

ఇక ఈ అంతర్గత సమావేశంలోనే జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ కార్యవర్గానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని పార్టీ జనరల్ సెక్రటరీగా ప్రకటించారు.


## వైభవంగా శ్రీపార్వతి కోటేశ్వరస్వామి కల్యాణోత్సవం

నల్లగొండ ఏప్రిల్ 27: నల్లగొండలోని చర్లపల్లిలో గల డీవీఎం బీఈడీ కళాశాల ప్రాంగణంలోని శ్రీ కోటేశ్వరస్వామి దేవాలయం 26వ వార్షికోత్స బ్రహోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుండే గణపతి పూజ, రుద్రాభిషేకాలు, హోమం, నవగ్రహా ఆరాదన వేద పండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రయుక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీ పార్వతి కోటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం జరిపించారు. వేడుకకు చర్లపల్లి, పరిసర ప్రాంతాల నుండి భక్తులు, ప్రజలు, డీవీఎం విద్య శిక్షణ కళాశాలల అద్యాపకులు, విద్యార్థులు హాజరై తిలకించారు. అనంతరం స్వామి అమ్మవార ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. రుత్విక్కులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జయప్రకాష్ నారాయణ కాలేజీ ఆఫ్ ఇం.ఇనీరింగ్(జెపీఎన్సీఈ) చైర్మన్ కె.ఎస్.రవికుమార్ దంపతులు, డీవీఎం విద్యా సంస్థల నిర్వహకులు దొడ్డా నాగరాజు శాంతికుమారి, దొడ్డా శాంతికుమార్ నందిని, దొడ్డా సాయి సంజయ్ అతిథి, కోటాల సాయితేజ- శ్రావ్య, డీవీఎం విద్యా సంస్థల సూపరింటెండెంట్ చోల్లేటి శ్రీధరాచారి, డీవీఎం బీఈడీ, ఎంఈడీ, డీఈడీ, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్స్, అద్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మరో ఆయిల్ ట్యాంకర్‌ను టార్గెట్ చేసిన ఇరాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ఒమాన్ తీరానికి సమీపంలో మరో ఆయిల్ ట్యాంకర్‌ను ఇరాన్ దళాలు టార్గెట్ చేశాయి. ఈ విషయాన్ని కేంద్రం వెల్లడించింది. టోగో దేశ జెండా ఉన్న ఒమాన్‌లోని షినాస్ పోర్టు సరిహద్దుకు సమీపంలో నౌక ఎమ్‌టీ సైరొన్‌పై ఏప్రిల్ 25న ఈ ఘటన జరిగిందని తెలిపింది.

ఇరాన్ టార్గెట్ చేసిన నౌకలో భారత సిబ్బంది కూడా ఉన్నారని కేంద్ర మంత్రి మన్‌దీప్ సింగ్ రణ్‌ధావా తెలిపారు. ఇతర నౌకలతో పాటూ వెళుతున్న ఎమ్‌టీ సైరొన్ నౌకను ఇరాన్ కోస్ట్ గార్డు దళాలు అడ్డగించి హెచ్చరికగా కాల్పులు జరిపాయని చెప్పారు. అయితే, నౌకలో భారతీయ సిబ్బంది అంతా సేఫ్‌గా ఉన్నారని అన్నారు. విదేశాంగ శాఖతో పాటూ ఇతర వర్గాల సమన్వయంతో అక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని చెప్పారు. భారత నావికుల భద్రతకు కట్టుబడి ఉన్నామని చెప్పారు.

# ఆధునిక టెక్నాలజీ వినియోగంతో శ్రామికుల భద్రత, ఆరోగ్యం !

## (28 ఏప్రిల్ "ప్రపంచ పని ప్రదేశ భద్రత మరియు ఆరోగ్య దినోత్సవం" సందర్భంగా)

ప్రతి ఒక్కరికీ సురక్షితమైన, ఆరోగ్యకరమైన పని వాతావరణం పొందే కనీస ప్రాథమిక హక్కు ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 28 ఏప్రిల్ రోజున "ప్రపంచ పని ప్రదేశాల్లో భద్రత మరియు ఆరోగ్యం దినోత్సవం (వరల్డ్ డే ఫర్ సేఫ్టీ అండ్ హెల్త్ ఎట్ వర్క్)" అనబడే కార్యక్రమాన్ని 2003 నుంచి ఐరాసకు చెందిన ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) నిర్వహిస్తోంది. వృత్తిపరమైన ప్రమాదాలు, వ్యాధుల నివారణను ప్రోత్సహించడానికి, పని ప్రదేశాల్లో భద్రతతో పాటు ఆరోగ్యకర వాతావరణాన్ని పెంచడానికి అవసరమైన అవగాహనను ఈ వేదికగా నిర్వహించడం జరుగుతుంది. కార్మికులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన పని పరిస్థితులను కల్పించడం యాజమాన్యాల కనీస బాధ్యత అని తెలుసుకోవాలి. ఉద్యోగంలో అనుకోని ప్రమాదాలు, వ్యాధులు అనే ప్రధాన సమస్యలతో 2.3 మిలియన్ల మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు.

పనిలో భద్రత, ఆరోగ్యాల కల్పనలో ఏఐ, డిజిటల్ టెక్నాలజీ పాత్ర:

"ప్రపంచ పని ప్రదేశాల్లో భద్రత, ఆరోగ్య దినోత్సవం" వేదికగా ప్రభుత్వాలు, సంస్థలు, ట్రేడ్ యూనియన్లు వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. 2026 ప్రపంచ పని ప్రదేశాల్లో భద్రత, ఆరోగ్య దినోత్సవం ఇతివృత్తంగా "పని ప్రదేశంలో మంచి మానసిక సామాజిక వాతావరణం – అభివృద్ధిలో శ్రామికులు, సంస్థల సన్మార్గ ప్రయత్నాలు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతుంది. దాదాపు 50% కార్మికులు పని ప్రదేశాల్లో అభద్రత, అనారోగ్యాలను ఎదుర్కొంటున్నారని తెలుస్తున్నది. ఆసియాలో కార్మికులు అత్యధికంగా వీటి బారినపడి ప్రాణాలు కోల్పోవడం లేదా అనారోగ్యాల కోరల్లో చిక్కడం ఆందోళనను కలిగిస్తున్నది. పని ప్రదేశ అనారోగ్యాల్లో హృద్రోగాలు అధికంగా నమోదు కావడం దురదృష్టకరం. ఐరాస – ఐఎల్ఓ వివరణ ప్రకారం పని ప్రదేశంలో భద్రత, ఆరోగ్యకర వాతావరణం పొందడం వారి కనీస హక్కు అని తెలుసుకోవాలి. అన్ని పనుల్లోకెల్ల గనుల్లో పని చేసే కార్మికులు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారు.

అత్యాధునిక టెక్నాలజీ వాడకంతో తగ్గిన ప్రమాదాలు:

వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం పొందడానికి నేటి అత్యాధునిక ఏఐ, డిజిటల్ టెక్నాలజీలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. ప్రమాదకరమైన పని ప్రదేశాలు, విష పదార్థాల నియంత్రణ, అతి ఉష్ణోగ్రతలు, ప్రమాదకర వాతావరణం లాంటి పరిస్థితుల్లో రోబోటిక్స్ వాడడం వల్ల పనులు త్వరగా, సులభంగా పూర్తి అవుతున్నాయి. రోబోలు, డ్రోన్లు లాంటి సాంకేతిక ఆవిష్కరణలతో ప్రమాదకరమైన పనులను తేలికగా చేయడం, ప్రమాద హెచ్చరికలకు డిజిటల్ సెన్సార్లు వాడడం సర్వసాధారణం అయిపోయింది. టెక్నాలజీని తొందరపడి వాడడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని కూడా తెలుసుకోవాలి. నేడు రోబోటిక్స్, ఏఐ – ఎంఎల్, ఎగ్జోస్కెలిటన్స్, మానవ రహిత వైమానిక వాహనాలు, ఐఓటి, రిమోట్ కంట్రోల్ వర్క్, వర్చువల్ అండ్ ఆగ్యుమెంటెడ్ రియాలిటీ లాంటి టెక్నాలజీలను ప్రమాదకర పని ప్రదేశాల్లో వినియోగించడం క్రమంగా పెరుగుతోంది.

వృత్తిపరమైన ఆరోగ్యం, సురక్షిత వాతావరణమే ప్రాధాన్యంగా సుస్థిర సమ్మిళిత అభివృద్ధి, వాతావరణ మార్పులను అడ్డుకోవడం వల్ల ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు–2030 కూడా సుసాధ్యం అవుతాయని గమనించాలి.

పని ప్రదేశాల్లో భద్రత కొరవడినపుడు కార్మికుల అనారోగ్యాలు పెరిగి వారితో ఉత్పత్తి సామర్థ్యం తగ్గుతూ, దీర్ఘకాలిక వ్యాధుల బారినపడతారని గమనించాలి. ఈ విషయాలన్నీ గమనిస్తూ పని ప్రదేశాల్లో సరైన భద్రత చర్యలు తీసుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పడం వల్ల ఉత్పత్తి పెరిగి దేశాభివృద్ధి వేగమ పుంజుకుంటుందని తెలుసుకుందాం, శ్రామికుల ఆరోగ్యమే యాజమాన్యాల మహాభాగ్యమని నమ్ముదాం.



-మధుపాళీ
9949700037

# ఖేలో భారత్ పథకం మన యువత శక్తికి, దేశ నిబద్ధతకు ప్రతిబింబం: మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రుల చింతన్ శిబిరం ఈరోజు శ్రీనగర్‌లో ప్రారంభమైంది. సమన్వయ చర్యలు, వ్యవస్థాగత సంస్కరణలు, విధాన సమ్మేళనం, క్షేత్రస్థాయి అమలు ద్వారా భారత క్రీడా వ్యవస్థను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టితో ఈ ప్రత్యేక సమావేశంలో చర్చలు జరుగుతున్నాయి.

ప్రారంభ సదస్సును ఉద్దేశించి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియ ప్రసంగిస్తూ, భారత క్రీడా లక్ష్యాలు క్షేత్రస్థాయి అమలుతోనే సాకారమవుతాయని స్పష్టం చేస్తూ, చర్చలకు దిశానిర్దేశం చేశారు.

'ప్రపంచ క్రీడా శక్తిగా ఎదగడానికి మన పదేళ్ల ప్రణాళిక కాగితాలకే పరిమితం కాకూడదు. అది ప్రతి క్రీడా మైదానంలో, ప్రతి జిల్లాలో, ప్రతి యువ స్వప్నంలోనూ సజీవంగా ఉండాలి" అని కేంద్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు.

జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కూడా చింతన్ శిబిరానికి హాజరయ్యారు. భారతదేశాన్ని క్రీడా శక్తి కేంద్రంగా మార్చాలనే దార్శనికతను అభినందించారు.

విధానాలను స్వీకరించడమే కాకుండా చురుకుగా అమలు చేయాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి రాష్ట్రాలకు పిలుపునిచ్చారు. జిల్లాలు, శిక్షణ వ్యవస్థలు, క్షేత్రస్థాయి క్రీడా వ్యవస్థలలో కనిపించే ఫలితాల ద్వారానే నిజమైన పురోగతిని అంచనా వేస్తామని ఆయన చెప్పారు.

ఖేలో భారత్ మిషన్ కేవలం అంకె మాత్రమే కాదు, ఇది మన యువత శక్తికి, దేశ నిబద్ధతకు ప్రతిబింబం అని ఆయన తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వాలు, క్రీడా సమాఖ్యల మధ్య దశాబ్దాలుగా ఉన్న అంతరాన్ని తొలగించి, బలమైన సమగ్ర ప్రతిభా వనరులను నిర్మించే దిశగా మరింత సమన్వయం పెంచుకోవాలని డాక్టర్ మాండవీయ పిలుపునిచ్చారు.

సమన్వయం ప్రాముఖ్యతను స్పష్టం చేస్తూ, విద్యా వ్యవస్థతో సమన్వయం ప్రాథమిక దశలో ప్రతిభను గుర్తించడానికి అవసరమని, వ్యాయామ ఉపాధ్యాయులు క్షేత్రస్థాయి క్రీడా వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తారని ఆయన వివరించారు.

అవకాశాలు అందక ఒక ప్రతిభావంతుడైన చిన్నారి వెనుకబడిపోయినా అది కేవలం వ్యక్తిగత నష్టం మాత్రమే కాదు, దేశానికే నష్టం అని ఆయన పేర్కొన్నారు.

జమ్ము కశ్మీర్ వంటి ప్రాంతాలు, ఇతర సవాళ్లతో కూడిన ప్రాంతాలలో క్రీడలు సామాజిక సామరస్యానికి, జాతీయ సమగ్రతకు తోడ్పడే పరివర్తన సాధనాలుగా పనిచేస్తాయని ఆయన అన్నారు.

వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి శిక్షకులకు క్రమం తప్పకుండా ధృవీకరణ, నైపుణ్యాల పెంపు, క్రీడాకారులకు శాస్త్రీయ శిక్షణ, క్రీడా పరిపాలనలో సామర్థ్యాల పెంపు చేపట్టాలని మంత్రి డాక్టర్ మాండవీయ పిలుపునిచ్చారు.

అంతరాయాలు లేని వ్యవస్థ ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, మౌలిక సదుపాయాలు, ప్రతిభ గుర్తింపు, సుశిక్షిత సిబ్బంది ఒక అవిచ్ఛిన్న గొలుసులా కలిసినప్పుడు, ఒలింపిక్ పతకాలు తప్పక వస్తాయి అని కేంద్ర మంత్రి అన్నారు. క్షేత్రస్థాయి భాగస్వామ్యాన్ని ఉన్నత స్థాయి ప్రదర్శనతో ఒక క్రమబద్ధమైన మార్గం ద్వారా అనుసంధానించాల్సిన అవసరాన్ని ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు.

గ్వాలియర్‌లోని లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రూపొందించిన యస్–పిఇ (యంగ్ ఎంగేజ్‌మెంట్ ఇన్ స్పోర్ట్స్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్) కార్యక్రమాన్ని డాక్టర్ మాండవీయ ప్రారంభించారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులలో క్రీడల్లో భాగస్వామ్యాన్ని, క్రీడాస్ఫూర్తిని నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.

క్రీడా శాఖ కార్యదర్శి శ్రీ హరి రంజన్ రావు సమావేశానికి హాజరైన వారందరికీ స్వాగతం పలుకుతూ, సామూహిక ఆలోచనలు, కార్యాచరణకు ఈ శిబిరం ఒక వేదికగా ఎలా ఉపయోగపడుతుందో వివరించారు.

చింతన్ శిబిరం ప్రాముఖ్యతను వివరిస్తూ, "ఈ సమావేశం కేవలం ఒక సదస్సు మాత్రమే కాదు. ఇది సామూహిక ఆలోచన, సంకల్పం నూతన నిబద్ధతలతో కూడిన సందర్భం" అని అన్నారు.

చింతన్ శిబిరంలో పతకాల సాధన వ్యూహం, విధానాల సమన్వయం, స్వచ్ఛమైన, సురక్షితమైన క్రీడలు, అలాగే ప్రతిభ గుర్తింపు, అభివృద్ధిపై దృష్టి సారించే ప్రత్యేక చర్చా సదస్సులు జరిగాయి.

15 మందికి పైగా రాష్ట్ర క్రీడా మంత్రులు, అడిల్ సుమరివాలా, అభినవ్ బింద్రా, పుల్లెల గోపీచంద్, గగన్ నారంగ్ వంటి ప్రముఖ క్రీడాకారులు ఈ చింతన్ శిబిరానికి హాజరయ్యారు. వీరు తమ ఆలోచనలను పంచుకోవడం ద్వారా, భారత క్రీడా వ్యవస్థను బలోపేతం చేయడానికి, సహకార విధాన చర్చలను ముందుకు తీసుకెళ్లడానికి ఉన్న సామూహిక నిబద్ధతను ప్రతిబింబించారు.

క్రీడాకారుల కోసం ఏకాభిప్రాయ విధానాలను రూపొందించే ఈ ప్రయత్నాన్ని వివిధ రాష్ట్రాల క్రీడా మంత్రులు, అభినందించారు. భారతదేశంలో పటిష్టమైన క్రీడా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి, బలోపేతం చేయడానికి ఈ నమూనాను దేశంలోని వివిధ ప్రాంతాలలో అమలు చేయవచ్చని వారు చెప్పారు.

మౌలిక సదుపాయాల బలోపేతం, కోచింగ్ వ్యవస్థల మెరుగుదల, కేంద్ర–రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం, నైతికమైన, సురక్షితమైన క్రీడా వాతావరణాన్ని నిర్ధారించడం, అలాగే పాఠశాలలు, అకాడమీలు, ఎలైట్ శిక్షణ కేంద్రాలను అనుసంధానిస్తూ శాస్త్రీయమైన, సాంకేతికతతో కూడిన ప్రతిభా వనరుల వ్యవస్థను నిర్మించడంపై ఈ చర్చలు ప్రత్యేక దృష్టి సారించాయి.

ఈ సమావేశాలు ప్రతిభను గుర్తించడం నుంచి ఉన్నత స్థాయి శిక్షణ వరకు క్రీడాకారుల అభివృద్ధిలో నిర్మాణాత్మక మార్గాల, సంస్థాగత అనుసంధానాల ప్రాముఖ్యతను కూడా స్పష్టం చేశాయి.

విధానాల అమలుతో క్షేత్రస్థాయిలో కొలవదగిన ఫలితాలను సాధించడానికి రాష్ట్రాల మధ్య స్థిరమైన పర్యవేక్షణ, మూల్యాంకనం, ఉత్తమ పద్ధతులను పంచుకోవడం ఎంతో అవసరమని కూడా వక్తలు అభిప్రాయపడ్డారు.

భారత్ ను ప్రపంచ క్రీడా శక్తిగా మార్చాలనే దీర్ఘకాలిక లక్ష్యానికి అనుగుణంగా బలమైన, సమ్మిళితమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న క్రీడా వ్యవస్థను నిర్మించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత భాగస్వాములందరితో కూడిన సమైక్య, సమన్వయ విధానం ప్రాముఖ్యతను ఈ చర్చలు పునరుద్ఘాటించాయి.

# కరెంటు ధర తగ్గిద్దాం

**అప్పుడు యూనిట్ ధర– 5.20**
**ఇప్పుడు 4.90 కి కొంటున్నాం**
**వినియోగం 14 శాతం పెరిగింది**
**వేసవిలో రోజుకు 285 ఎంయూ అవసరం**
**రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదనే లక్ష్యం**
**ప్రత్యేక ఎనర్జీ యూనివర్శిటీ పెడ్దాం**
**ఈవీ లపై ప్రజల్లో విస్తృత అవగాహన**
**పీఎం సూర్య ఘర్, కుసుమ్ పథకాలకు కార్యాచరణ**
**ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష**

అమరావతి, ఏప్రిల్ 27:ప్రజా ప్రయోజనాల కోసమే సంస్కరణలు తెస్తున్నామని ఆ సంస్కరణల అమలు కోసం టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసే అంశంపై నిరంతరం అధ్యయనం, జరుగుతూనే ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ పై సీఎం చంద్రబాబు సమీక్షించారు. వేసవిలో విద్యుత్ సరఫరా, 2026–27 ఏడాదిలో విద్యుత్తు సేకరణ , పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలు పై చర్చించారు.

### వినియోగం పెరిగింది

వేసవిలో ప్రతి రోజూ 275 నుంచి 285 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటుందని అంచనా వేసినట్టు అధికారులు చెప్పారు. ఈ నెలలో ఇప్పటి వరకు 6397 మిలియన్ యూనిట్ల విద్యుత్ ను వినియోగించుకున్నామని వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం మేర విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. విద్యుత్ వినియోగం పెరగడానికి వేసవితో పాటు పారిశ్రామిక వినియోగం కూడా పెరిగిందని అధికారులు వివరించారు. వచ్చే ఆరు నెలల కాలానికి విద్యుత్ కొనుగోళ్ల ప్రణాళికలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. ఏప్రిల్ 2025లో విద్యుత్ కొనుగోలు ధర రూ. 5.20 ఉండగా.. మార్చి 2026 నాటికి రూ. 4.90కు తగ్గించామని అధికారులు చెప్పారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలవుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

### రెనబుల్.. ఎనర్జీపైనే దృష్టి

ఈ సందర్భంగా ముఖ్య



మంత్రి మాట్లాడుతూ విద్యుత్ కొనుగోళ్ల వ్యయం తగ్గాలి. ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో.. అలాంటి చర్యలన్నింటిపైనా అధికారులు దృష్టి పెట్టాలి. విద్యుత్ రంగంలో ఏయే దేశాల్లో ఎలాంటి కొత్త ఆవిష్కరణలు అమలు అవుతున్నాయో అధ్యయనం చేయాలి. ఈ ఏడాది చివరి నాటికి విద్యుత్ కొనుగోలు ధరను రూ. 4.60కు తగ్గించాలి.

ఈ దిశగా విద్యుత్ శాఖాధికారులు దృష్టిసారించాలి. విద్యుత్ రంగంలో సహా ఏ రంగంలోనైనా ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతోనే సంస్కరణలు అమలు చేస్తున్నాం. ప్రజలకు మేలు చేయాలంటే టెక్నాలజీ వినియోగం అత్యంత అవసరం. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ నిరంతరం గుర్తు చేసుకోవాలి. విద్యుత్ లో రీసెర్చ్ అండ్ అనాలసిస్ కు పెద్ద పీట వేయాలి. దీని కోసం ట్రాన్స్ కో, జెన్కో వంటి సంస్థలు తమకున్న సీఎస్సార్ నిధులు కేటాయించాలి. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయింపులు జరిపేలా చర్యలు తీసుకుంటాం. పంప్డ్ స్టోరేజీ విధానంలో విద్యుత్ ఉత్పత్తిపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. అన్నారు.

### ఎనర్జీ వర్సిటీ పెడ్దాం

ఎనర్జీ యూనివర్శిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. పొల్యూషన్ తగ్గేలా పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలి. 2028–29 నాటికి సగాని పైగా విద్యుత్ ఉత్పత్తి రెన్యూవబుల్ ఎనర్జీ ద్వారా వచ్చేలా చూడాలి.

పీఎం సూర్య ఘర్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 52,396 సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇచ్చాం. దీన్ని మరింత వేగవంతం చేయాలి. ఇకపై ప్రతి నెల 2 లక్షల పీఎం సూర్య ఘర్ కనెక్షన్లు ఇచ్చేలా చూడాలి. పీఎం కుసుమ్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 2.94 లక్షల కనెక్షన్లు ఇచ్చాం. మొదటి విడత పీఎం కుసుమ్ పథకాన్ని డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలి, అని సీఎం ఆదేశించారు.

### ఛార్జింగ్ స్టేషన్లు పెట్టండి

రాష్ట్ర వ్యాప్తంగా ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలి. ఇక ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కొనుగోళ్లపై పెద్ద ఎత్తున ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, విద్యుత్, ట్రాన్సుకో, జెన్కో, వివిధ డిస్కంలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పెట్రోలియం ఉత్పత్తుల కొరతను నివారించండి

**-ఆకుల శ్రీనివాస్ డిమాండ్**

అమరావతి, ఏప్రిల్ 27: రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ , వంట గ్యాస్ వంటి పెట్రోలియం ఉత్పత్తుల కొరతను నివారించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రస్తుతం పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని శ్రీనివాస్ పేర్కొన్నారు. పెట్రోలియం ఉత్పత్తుల పంపిణీ సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ముఖ్యంగా గృహ అవసరాలకు వాడే వంటగ్యాస్ విషయంలో విపరీతంగా బ్లాక్ మార్కెటింగ్ జరుగుతోందని, ఒక్కో సిలిండర్ రూ. 3000 వరకు విక్రయిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుత అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల కారణంగా పెట్రోలియం ఉత్పత్తుల కొరత మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఇతర దేశాల నుండి దిగుమతులను పెంచి దేశీయ కొరతను తీర్చాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తక్షణమే స్పందించి సరఫరాను క్రమబద్ధీకరించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రజలకు నిత్యావసరమైన ఇంధన సరఫరాలో అంతరాయం కలగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని ఆకుల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# నరసరావుపేటలోని స్టేడియంలో ఆటకు రేటు

## -క్రీడల పట్ల కూటమి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టిన డాక్టర్ గోపిరెడ్డి

అమరావతి, అమరావతి, ఏప్రిల్ 27: డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం లో ఆటలాడుకునే వారి వద్ద నుంచి వేల రూపాయల యూజర్ చార్జీలు దండుకుంటున్నారనే సమాచారంతో నరసరావుపేట డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యం లో నిర్వహించే స్టేడియంను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సందర్శించి అక్కడ అంతా కలయదిరిగారు.అక్కడ క్రీడాకారులతో మాట్లాడారు. మూతపడ్డ జిమ్, షటిల్ పాయింట్స్ ను, స్విమ్మింగ్ పూల్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ వారు స్టేడియంలో యూజర్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని, ఇక్కడి స్టేడియం మైదానంలో పిల్లలు ఆటలు ఆడుకోవాలంటే నెలకు రు.2,500 కట్టాల్సిన దుస్థితి ఆటగాళ్లకు ఏర్పడిందని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా స్విమ్మింగ్ పూల్ మరమ్మతులు చేయకుండా నిర్వీర్యం చేశారని, రెండు నెలలుగా జిమ్ పాయింట్,షటిల్ కోర్టును మూసివేయడం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వం స్టేడియం ను పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేసిందని విమర్శించారు.

గత పాతిక సంవత్సరాలుగా ఎన్నడూ లేని విధంగా స్టేడియంలో క్రికెట్, ఇతర ఆడుకునే వారి వద్ద నుంచి యూజర్ చార్జీల పేరుతో 2,500రూపాయల వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇది దారుణమైన విషయమని అంబరు. ఆటగాళ్లకు ప్రోత్సాహాలు అందించి స్పోర్ట్స్ ను ప్రోత్సహించాల్సినది పోయి వారి వద్ద నుంచే డబ్బులు వసూలు చేయడం అన్యాయం అన్నారు.

గత వైసిపి ప్రభుత్వం లో ఒక్క రూపాయి కూడా యూజర్ చార్జీలు వసూలు చేయకుండా ఆటగాళ్లని ప్రోత్సహించామని, ప్రస్తుతం స్టేడియం ఇన్చార్జిగా వచ్చిన నరసింహారెడ్డి అనే వ్యక్తి గత వైసీపీ ప్రభుత్వం లో కూడా ఇక్కడ కు వచ్చి యూజర్ చార్జీలు వసూలు చేయాలని చూశాడని తక్షణమే స్పందించిన మేము అప్పుడు అతనిని వెనక్కి పంపడం జరిగిందని గుర్తు చేసారు.అయితే అదే వ్యక్తి తిరిగి ఇప్పుడు స్టేడియం ఇన్చార్జిగా వచ్చి యూజర్ చార్జీలు పెట్టి స్టేడియంను నిర్వీరం చేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. ,

స్థానిక ప్రజాప్రతినిధి, కలెక్టర్ స్పందించి యూజర్ చార్జీలు లేకుండా ఆటగాళ్లను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాల కాలం అయిన ప్పటికీ ఎందుకు స్విమ్మింగ్ పూల్ ప్రారంభించలేక పోయారని ప్రశ్నించారు.గొప్పలు చెబుతున్నారు తప్ప ఎక్కడ అభివృద్ధి జరగడం లేదని గోపిరెడ్డి విమర్శించారు.

దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా పెట్రోల్ మరియు డీజిల్ కొరత లేదని, కేవలం ఒక్క ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోనే ఇటువంటి పరిస్థితి ఎందుకు వచ్చిందని కూటమి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు?

కేవలం కూటమి ప్రభుత్వ చేతకానితనం వల్లనే ఈ పరిస్థితి రాష్ట్రానికి వచ్చిందని, మంత్రులందరూ సింగపూర్ కు వెళ్లారని, వారం రోజులుగా లోకేష్ ఎక్కడున్నారో ఎవరికి తెలియదని అన్నారు. రాష్ట్రంలో గ్యాస్, పెట్రోల్ మరియు డీజిల్ అందుబాటులో లేదని ఈ ప్రభుత్వానికి పరిపాలన చేతకాదని తీవ్రంగా విమర్శించారు.

తక్షణమే ప్రభుత్వం స్పందించి ఎటువంటి యూజర్ చార్జీలు లేకుండా ఆటగాళ్లకు స్టేడియంలో ఆడుకునే స్వేచ్ఛను కల్పించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజా వాసిరెడ్డి సేవలు చిరస్మరణీయం..

## ప్రజా సంక్షేమానికి అంకితభావంతో నిలిచిన మహారాజుకు ఘన నివాళి–జిల్లా కలెక్టర్

అమరావతి, ఏప్రిల్ 27: ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో విశేష కృషి చేసి "ప్రజల రాజు"గా పేరు పొందిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గుణ భూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ప్రముఖ జమిందారులలో ఒకరని తెలిపారు. గుంటూరు జిల్లాలోని అమరావతి ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని ఆయన పరిపాలన సాగించారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, ధార్మిక సేవలు, వ్యవసాయ అభివృద్ధి, పట్టణ నిర్మాణం వంటి అనేక రంగాల్లో ఆయన చేసిన సేవలు అపారమని కొనియాడారు.

1761 ఏప్రిల్ 27న జగ్గన్న, అచ్చమ్మ దంపతులకు జన్మించిన వెంకటాద్రి నాయుడు, కృష్ణా జిల్లాలోని చింతపల్లి సంస్థానానికి చెందినవారని, 1783లో పట్టాభిషేకం పొందారని తెలిపారు. ప్రజలపై అధిక పన్నుల భారం మోపడానికి ఆయన వ్యతిరేకంగా నిలిచారని చెప్పారు. ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి సమర్థవంతమైన పాలన అందించారని వివరించారు. కరువు సమయంలో ప్రజలను ఆదుకునేందుకు ధనాగారాన్ని సిద్ధం చేసి సహాయం చేయడంతో ప్రజలు ఆయనను "ప్రజల రాజు"గా గౌరవించారని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనలో సైన్యం తగ్గించబడిన అనంతరం రాజధానిని అమరావతి (ధరణికోట)కు మార్చి అద్భుత కట్టడాలను నిర్మించారని తెలిపారు.

గుంటూరు జిల్లాలోని ఎనాన్నంగంలో అమరేశ్వరాలయాన్ని పునర్నిర్మించిన ఘనత కూడా ఆయనదేనని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌లోని పంచారామ క్షేత్రాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. దైవభక్తితో అనేక ఆలయాలను నిర్మించి ధార్మిక సేవలకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. పొన్నూరులో నిర్మించిన ఆలయాలు, గోపురాలు, తొమ్మిది ఆలయాల సముదాయం ఆయన వైభవాన్ని ప్రతిబింబిస్తాయని తెలిపారు. ధర్మం, న్యాయం, అభివృద్ధి కోసం కృషి చేసిన మహారాజుగా గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల హృదయాల్లో ఆయన చిరస్థాయిగా నిలిచారని కలెక్టర్ కొనియాడారు. ఇటీవల ఆజాదీ కా అమృత్ మహోత్సవం సందర్భంగా ఈ చారిత్రక ప్రదేశాలను సందర్శించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. .వడగాలులపై సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసిన ఐఎండీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:దేశంలోని పలు ప్రాంతాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్న వేడిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర భూవిజ్ఞాన శాస్త్ర మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత వాతావరణ శాఖ వడగాలులపై వివరణాత్మక మార్గదర్శకాలను, సూచనలను జారీ చేసింది.

తాజా అంచనాల ప్రకారం.. వాయువ్య, మధ్య, ద్వీపకల్ప భారత్‌లోని అనేక ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 40 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతున్నాయి. రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే ఎక్కువగా నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇది దేశంలోని కొన్ని ప్రాంతాల్లో వడగాలుల తీవ్రత పెరుగుతోందని సూచిస్తోంది.

రాబోయే రోజుల్లో జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్య భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీరప్రాంతాలు, తూర్పు రాష్ట్రాల లో ఉక్కపోతతో కూడిన వేడి, తేమ పరిస్థితులు ఉంటాయని అంచనా వేసింది. ఉత్తర భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లో రాత్రులు కూడా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండవచ్చని పేర్కొంది. దీనివల్ల ప్రజలు మరింత అసౌకర్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపింది.

వాయువ్య భారత్‌లో ఏప్రిల్ 27 వరకు గరిష్ట ఉష్ణోగ్రతలలో పెద్దగా మార్పు ఉండదని, ఆ తర్వాత క్రమంగా తగ్గుముఖం పట్టవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే, మధ్య భారత్, ఇతర ప్రాంతాలలో రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగి, ఆ తర్వాత తగ్గే అవకాశం ఉందని వెల్లడించింది.

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పౌరుల కోసం సమగ్రమైన భద్రతా మార్గదర్శకాలను ఐఎండీ జారీ చేసింది. పౌరులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. వీటిలో ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో ఎక్కువ సేపు నేరుగా సూర్యరశ్మి తగలకుండా ఉండటం, తగినంత నీరు తాగడం, తేలికపాటి, గాలి ఆడే, లేత రంగు దుస్తులు ధరించడం, ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న సమయంలో శ్రమతో కూడిన బహిరంగ పనులకు దూరంగా ఉండటం వంటివి ఉన్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఎండ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ముందస్తు అవగాహన, నివారణ చర్యల ద్వారా వడదెబ్బ, వేడి వల్ల కలిగే తీవ్ర అలసట వంటి ప్రమాదాలను తగ్గించవచ్చని ఐఎండీ తెలిపింది. రాబోయే 7 రోజుల పాటు పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఈ కింది ప్రాంతాల్లో వడగాలులు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఒడిశా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ వంటి తీరప్రాంత రాష్ట్రాల్లో ఉక్కపోత, తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర భారత మైదాన ప్రాంతాల్లో రాత్రిపూట కూడా వేడి వాతావరణం కొనసాగవచ్చని, దీనివల్ల రాత్రి సమయాల్లో కూడా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది.

ఐఎండీ విడుదల చేసిన ఏప్రిల్ నుంచి జూన్ వరకు గల ముందస్తు అంచనాల ప్రకారం.. తూర్పు, మధ్య, వాయువ్య భారత్‌తో పాటు ఆగ్నేయ ద్వీపకల్పంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాలుల వీచే అవకాశం ఉంది. ఈ సుదీర్ఘ వేసవి కాలాన్ని తట్టుకోవడానికి ముందస్తు సన్నద్ధత, నివారణ చర్యలు అత్యవసరమని అధికారులు తెలిపారు.

వడగాలుల సమయంలో ఏం చేయాలి, ఏం చేయకూడదు, వివిధ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సూచనలతో కూడిన సమగ్ర సమాచారాన్ని ఐఎండీ తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఆరోగ్య ప్రమాదాలను తగ్గించుకోవడానికి, తీవ్రమైన ఎండలను తట్టుకునే శక్తిని పెంపొందించుకోవడానికి వ్యక్తులు, సమాజాలు, స్థానిక యంత్రాంగాలకు ఈ మార్గదర్శకాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

వాతావరణ శాఖ నిరంతరం ఉష్ణోగ్రత మార్పులను పర్యవేక్షిస్తూ, సమయానుకూలంగా హెచ్చరికలు జారీ చేస్తోంది. ప్రజలు అధికారిక వనరుల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటూ, సూచించిన భద్రతా చర్యలను ఖచ్చితంగా పాటించాలని ఐఎండీ కోరింది.

# మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

నల్గొండ, ఏప్రిల్ 27:రాష్ట్ర సమితి (బీఆర్ఎస్ ) పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించాయి. పార్టీ స్థాపించి 25 ఏళ్లు పూర్తి చేసుకుని 26వ ఏట అడుగుపెడుతున్న శుభసందర్భంగా మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద గులాబీ జెండాను ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ తన 26 ఏళ్ల ప్రస్థానంలో 13 ఏళ్లు ఉద్యమ పార్టీగా, ఆపై 10 ఏళ్లు పాలక పార్టీగా ఎన్నో చారిత్రక ఘట్టాలకు, అభివృద్ధి నమూనాలకు వేదికగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ అస్తిత్వాన్ని చాటిన పార్టీగా ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష హోదాలో ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు క్షేత్రస్థాయిలో నిలదీస్తామని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని విమర్శించారు. రాబోయే రోజుల్లో మళ్లీ అధికారం బిఆర్ఎస్ పార్టీదేనని, కేసీఆర్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంతో పని చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు నాయకత్వంలో ఎవరైనా పార్టీలోకి రావచ్చని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పసర్తి అనిల్ కుమార్, కాసనగొట్టు లింగన్న, అక్కల రవీందర్, గొట్ల భూమన్న, గోళ్ళ రాజమల్లు, బచ్చల అంజన్న, పత్తిపాక శ్రీనివాస్, రేణి శ్రీనివాస్, గొట్ల రవి, ఆశెట్టి వెంకటరమణ, అల్వాల సత్యం మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదివాసీల పోడు భూములకు పట్టాలివ్వాలి

## ఐటీడీఏ ముట్టడి



ఆదిలాబాద్, ఏప్రిల్ 27: ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉట్నూరులో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా ర్యాలీగా వెళ్లిన బాధితులు, నాయకులు ఐటీడీఏ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, పి.వి.టి.జి. ఏపీఓ ఆత్రం భాస్కర్ లకు అందజేశారు. గిరిజనుల విజ్ఞప్తులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీఓ వసంతరావు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఈ ధర్నాలో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వెంకటాద్రి మాటాడుతూ.. గత 40 ఏళ్లుగా ఆదివాసీలు తమ సమస్యలపై పోరాడుతున్నా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు.

అభివృద్ధి, అడవుల సంరక్షణ, హరితహారం పేరుతో గిరిజనులు సాగు చేస్తున్న భూముల్లో మొక్కలు నాటడం, కందకాలు తవ్వడం వంటి చర్యల ద్వారా వారిని భూముల నుండి తరిమివేస్తున్నారని ఆరోపించారు.

1/70 చట్టం, 2006 అటవీ హక్కుల చట్టం సక్రమంగా అమలు కావడం లేదని, ప్రతి ఏటా సాగు సమయంలో అటవీ, పోలీస్ యంత్రాంగం గిరిజనులపై దాడులకు తెగబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో టైగర్ జోన్ల ఏర్పాటు పేరుతో ఆదివాసీలను మభ్యపెట్టి గ్రామాల నుండి ఖాళీ చేయిస్తున్నారని, మనుషుల కంటే పులులకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు.

1/70 చట్టం ప్రకారం కోర్టు తీర్పులు గిరిజనులకు అనుకూలంగా వచ్చినా, రెవెన్యూ అధికారులు పంచనామాలు నిర్వహించి భూములను అప్పగించడంలో జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని గిరిజన గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రోడ్డు సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం నాయకులు కుటికెల శంకర్, సిడం ధర్మం (ఆసిఫాబాద్), ధారంగుల ఎల్లయ్య, ఎనుముల నరసయ్య (మంచిర్యాల), మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్యారాణి, పీడీఎస్యూ నేత వాగ్మారే సంబాజీ, సోయం జుగాధిరావు (ఆదిలాబాద్), గోపి చంద్రయ్య (జగిత్యాల) మరియు ఉమ్మడి జిల్లాల ఆదివాసీలు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు




నల్గొండ, ఏప్రిల్ 27:బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలో ఈ రోజు అత్యంత ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు మందుల సత్యం ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మందుల సత్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో బిఆర్ఎస్ పార్టీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. ఉద్యమ పార్టీగా ప్రారంభమైన బిఆర్ఎస్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతూ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. రైతు సంక్షేమం,పేదల అభ్యున్నతి, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో పార్టీ ప్రభుత్వం విశేష కృషి చేసిందన్నారు. పార్టీ స్థాపక నాయకత్వం చూపిన మార్గంలో ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులోనూ ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డ్ మెంబర్లు,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పథకాలు, మౌలిక సదుపాయాల ద్వారా వృద్ధికి సారథిగా నిలుస్తున్న ఇన్‌స్పేస్: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అంతరిక్ష ప్రయోగశాలలను ఏర్పాటు చేసే ప్రణాళికపై కేంద్ర సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు సమీక్షించారు. ఉపగ్రహ వ్యవస్థలు, రాకెట్ సాంకేతికత, మిషన్ డిజైనింగ్‌లో విద్యార్థులకు ప్రయోగాత్మక అవగాహన కల్పించడం లక్ష్యంగా మొదటి దశలో ఈ తరహాలో ఏడు ప్రయోగశాలలను నెలకొల్పనున్నారు.

అంతరిక్ష రంగంలో ప్రభుత్వేతర సంస్థలనూ అనుమతించిన తర్వాత, గత అయిదేళ్లలో ఈ రంగం దాదాపు 600 మిలియన్ డాలర్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించింది. ఈ నేపథ్యంలో.. క్రమంగా విస్తరిస్తున్న భారత అంతరిక్ష రంగం కోసం నైపుణ్యం కలిగిన యువతను సిద్ధం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యం.ఇన్ స్పేస్ ఛైర్మన్ డాక్టర్ పవన్ గోయెంకా క్లుప్తమైన వివరణ అనంతరం ఈ సమీక్ష కొనసాగింది. దేశ అంతరిక్ష సంస్కరణల్లో పురోగతిని, ఈ రంగం లోని ప్రతి దశలోనూ ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం పెరుగుతున్న తీరును ఆయన సంక్షిప్తంగా వివరించారు.భారత ప్రైవేటు అంతరిక్ష వ్యవస్థ వేగంగా విస్తరించింది. ఈ రంగంలో అంకుర సంస్థల సంఖ్య 2019 లో ఒక అంకెకే పరిమితమై ఉండగా.. 2026 ప్రారంభం నాటికి అది 400 దాటింది. ప్రయోగ వాహనాలు, ఉపగ్రహాలు - పేలోడ్ తయారీ, భూతల మౌలిక సదుపాయాలు, డేటా సేవలు, కొత్తగా అభివృద్ధి చెందుతున్న కక్ష్యాంతర్గత విభాగాల్లో ప్రస్తుతం ఈ అంకుర సంస్థలు క్రియాశీలకంగా సేవల ందిస్తున్నాయి. అంతరిక్ష యానం లో ఇప్పటికే బలమైన స్థానంలో ఉన్న దేశాలు సహా అంతర్జాతీయ క్లయింట్లతో సంబంధాలూ మెరుగుపడుతున్నాయి. ప్రపంచ దేశాలు మరింత ఆసక్తిగా భారత్ వైపు చూస్తున్నాయనేందుకు ఇది నిదర్శనం.

ఈ వేగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం కోసం నిర్దేశిత లక్ష్యంతో అనేక కార్యక్రమాలను కూడా ప్రభుత్వం ప్రారంభించింది. వృద్ధి దశలో ఉన్న అంకుర సంస్థలకు దన్నుగా నిలిచేందుకు సిడ్బీతో కలిసి రూ. 1,000 కోట్ల వ్యాపార విస్తరణ నిధిని అందుబాటులోకి తెస్తున్నారు. అలాగే, ప్రారంభ దశలో ఉన్న ఆవిష్కరణలను వాణిజ్యపరంగా లాభదాయకమైన ఉత్పత్తులుగా మార్చడం కోసం రూ. 500 కోట్ల సాంకేతికతా సహాయక నిధితో సహకరిస్తోంది. ఇక ఆలోచన, నమూనా దశలో ఉన్న అంకుర సంస్థలకు ప్రాథమిక పెట్టుబడి నిధి (సీడ్ ఫండ్) పథకం ద్వారా రూ. కోటి వరకు గ్రాంట్లు అందించడంతోపాటు.. మార్గదర్శకత్వాన్నీ, ఇతర వ్యవస్థాపరమైన చేయూతనూ అందిస్తోంది.

నైపుణ్యం కలిగిన మానవ వనరులను సిద్ధం చేసే ప్రయత్నాలు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. 17 ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ఇప్పటికే పూర్తి చేయగా.. ఉపగ్రహ తయారీ, ప్రయోగ వాహన వ్యవస్థలు, అంతరిక్ష సైబర్ భద్రత వంటి విభాగాల్లో దాదాపు 900 మంది అభ్యర్థులు ధ్రువీకరణ సాధించారు. విశ్వవిద్యాలయాల్లో ఏర్పాటు చేయబోయే అంతరిక్ష ప్రయోగశాలలు.. విద్యార్థులకు ప్రయోగాత్మక అభ్యాస అవకాశాలను కల్పించడం ద్వారా ఈ ప్రతిభను మరింత బలోపేతం చేస్తాయని ఆశాభావంతో ఉన్నారు.

మౌలిక సదుపాయాల పరంగా చూస్తే.. ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్య నమూనాలో ప్రైవేటు సంస్థల నేతృత్వంలోని భూపరిశీలక ఉపగ్రహాల సమూహం, అంకుర సంస్థల కోసం ఉమ్మడి ఉపగ్రహ బస్ ప్లాట్‌ఫారమ్ అభివృద్ధి, అహ్మదాబాద్‌లో ఇన్ స్పేస్ సాంకేతిక కేంద్రంలో డిజైన్, సమీకరణ, పరీక్ష సౌకర్యాల విస్తరణ వంటి కార్యక్రమాల ద్వారా సరికొత్త అవకాశాలు

# పేదలకు ఉచిత వైద్య సేవలు అభినందనీయం

## - కోదాడ మున్సిపల్ ఛైర్మన్ ఎర్నేని కుసుమ



నల్గొండ, ఏప్రిల్ 27: పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమని కోదాడ మున్సిపల్ ఛైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని 34వ వార్డులో స్థానిక కౌన్సిలర్ గంధం బాలేంద్రపాండు సహకారంతో కుర్రి సీతారాములు జ్ఞాపకార్థం ఆయన 10వ వర్ధంతి సందర్భంగా యశోద హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో దాదాపు 400 మందికి అన్ని రకాల వ్యాధులతో పాటు షుగర్, బీపీ, ఈసీజీ, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. లయన్స్ కంటి ఆసుపత్రి వారిచే కంటి పరీక్షలు చేసి మందులు అందించడంతో పాటు అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

సామాజిక సేవలో స్వర్ణ భారతి ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ గంధం బాలేంద్ర, పాండు మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ల తో పాటు వైద్యులను శాలువా, పూలబొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మల్లీశ్వరి, కౌన్సిలర్లు నాగేశ్వరరావు, వంగూరి గోపి, తోట శ్రీను, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల ప్రవీణ, రాజశేఖర్, ఓరుగంటి కిట్టు, గుండెపంగు రమేష్, కాంపాటి పుల్లయ్య, ఏర్పుల తిరుప్, శ్రావణ్, కుర్రి నాగరాజు, కుర్రి శ్రీను, కుర్రి వెంకమ్మ, కుడుముల శ్రీను, వంశీ, హేమావతి, చిట్టిప్రోలు నారాయణ పాల్గొన్నారు.

# యూరియా ఆన్‌లైన్ విధానం ఎత్తేయాలి

## -కలెక్టర్, డీఏఓకు పెస్టిసైడ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి



నల్గొండ, ఏప్రిల్ 27: యూరియా ఆన్‌లైన్ విధానం ఎత్తివేయాలని, ఎరువుల బస్తాలకు ఇతర ప్రోడక్ట్ లింక్ చేయొద్దని ఫర్టిలైజర్ పెస్టిసైడ్ సీడ్స్ డీలర్స్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఫర్టిలైజర్ షాపుల బంద్ సోమవారం విజయవంతం అయింది. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానం నుండి పెస్టిసైడ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి గడియారం సెంటర్ మీదుగా ర్యాలీగా వెళ్లి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ చంద్రశేఖర్ కు వినతిని అందజేసి మాట్లాడారు. రైతులు, డీలర్ల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ చర్యలు కంపెనీలకు కొమ్ముకాసేలా ఉంటున్నాయన్నారు. ఎరువుల స్టాక్ పాయింట్ నుండి దుకాణానికి సరఫరా అయ్యే రవాణా ఖర్చులు భరించాలని, బడా కంపెనీల పెత్తనం తగ్గించాలని కోరారు. లింకు ప్రోడక్ట్ బలవంతంగా అంటగట్టడాన్ని నిలిపివేయాలన్నారు. రాష్ట్రవ్యాప్త ఎరువుల దుకాణాల బంద్ కార్యక్రమంలో భాగంగా పెస్టిసైడ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన కార్యక్రమానికి తిప్పర్తి, కనగల్, మునుగోడు, గుర్రంపోడు, మాడుగులపల్లి మండలాల నుంచి పెద్ద ఎత్తున డీలర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఫర్టిలైజర్ ఫెర్టిసైడ్స్ సీడ్స్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బండ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి మధు, కోశాధికారి సుంకరి నాగరాజు గౌడ్, పగిడి విగ్నేష్, యాదగిరి రెడ్డి, ఉపేందర్, మహేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, గోవింద్ రెడ్డి, శ్రీను, వెంకన్న, చంద్రమౌళి, నాగభూషణ్ పాల్గొన్నారు.

# దక్షిణాఫ్రికాలోని జోహానెస్‌బర్గ్‌లో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 27:బీఆర్ఎస్ దక్షిణాఫ్రికా అధ్యక్షుడు నాగరాజు గుర్రాల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను జోహానెస్‌బర్గ్‌లో ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు నాగరాజు గుర్రాల మాట్లాడుతూ తెలంగాణ సాధన లక్ష్యంతో ప్రారంభమైన ఈ ఉద్యమం శక్తివంతమైన రాజకీయ శక్తిగా మారిందని వివరించారు.

తెలంగాణ అభివృద్ధి , సంక్షేమ పథకాల కొనసాగింపుకోసం బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఎంతో అవసరమని తెలిపారు. దక్షిణాఫ్రికాలో ఫ్రీడమ్ డే, తెలంగాణలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు ఒకే రోజు కావడం గర్వంగా ఉందని అన్నారు. మండేలా , కేసీఆర్ ఇద్దరు యోధులని అన్నారు .ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి మేడసాని, సాయి కిరణ్ నల్ల, సుమన్ పోరండ్ల, అరవింద్ చీకోటి, రాజయ్య చీకోటి, మహేందర్ రెడ్డి ఎల్లనొల్ల తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక ఆయుధ తరలింపు ట్రాక్డ్ అండ్ వీల్డ్ వాహన వేదికలను ఆవిష్కరించిన డీఆర్డీఓ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:రక్షణ దళాల మారుతున్న నిర్వహణ అవసరాలను తీర్చడానికి అభివృద్ధి చేసిన అధునాతన ట్రాక్డ్, వీల్డ్ ఆయుధ తరలింపు వాహన వేదికలను రక్షణ శాఖ (పరిశోధన - అభివృద్ధి) కార్యదర్శి, డీఆర్డీఓ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ ఏప్రిల్ 25, 2026న మహారాష్ట్రలోని అహల్యనగర్ లో గల రక్షణ పరిశోధన,అభివృద్ధి సంస్థ ప్రయోగశాల ప్రాంగణంలో ఆవిష్కరించారు. వాహనాల పరిశోధన, అభివృద్ధి సంస్థ వీటికి రూపకల్పన చేసి అభివృద్ధి చేసింది.

చలనశీలత, అగ్నిశక్తి, రక్షణ అవసరాలను తీర్చగల అధునాతన లక్షణాలతో కూడిన స్వదేశీ రూపకల్పన, అభివృద్ధి చెందిన 30 మిల్లీమీటర్ల సిబ్బంది రహిత ఆయుధ పీఠాలను ఈ రెండు వేదికలకు అమర్చారు.అధిక శక్తి గల ఇంజిన్, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో సమగ్రంగా అమర్చిన ఈ వాహనాలు, అధిక శక్తి , బరువు నిష్పత్తి, ఎక్కువ వేగ సామర్థ్యం, ఏటవాలు ప్రాంతాలు, అడ్డంకులను అధిగమించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. స్టానాగ్ స్థాయి 4, 5 రక్షణను అందిస్తూ, చుట్టూ మాడ్యులర్ బ్లాస్ట్, బాలిస్టిక్ రక్షణతో వీటిని రూపొందించారు. జల చోదక యంత్రాలను చేర్చడం ద్వారా నీటి అడ్డంకులను దాటే మెరుగైన సామర్థ్యం కలిగిన ఈ ఉభయచర వాహనం కార్యాచరణ సౌలభ్యాన్ని అందిస్తుంది.

30 మిల్లీమీటర్ల సిబ్బంది రహిత ఆయుధ పీఠం, 7.62 మిల్లీమీటర్ల పికెటి తుపాకీతో పాటు ట్యాంకు విధ్వంసక మార్గదర్శక క్షిపణులను ప్రయోగించడానికి వీలుగా దీనిని రూపొందించారు. ప్రాథమిక నమూనాను బహుళ పాత్రలకు అనుగుణంగా మార్చుకునే సామర్థ్యం ఉంది. స్వదేశీ తయారీ ప్రస్తుత 65 శాతాన్ని 90 శాతానికి పెంచే ప్రణాళికలు ఉన్నాయి.

ఈ వేదికల తయారీని రెండు పరిశ్రమ భాగస్వాములుటాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, భారత్ ఫోర్జ్ లిమిటెడ్ కలసి అనేక సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మద్దతుతో చేపట్టాయి. ఈ భాగస్వామ్యం అభివృద్ధి చెందుతున్న రక్షణ వ్యవస్థను బలోపేతం చేసింది.

ఆర్మమెంట్, కాంబాట్ ఇంజినీరింగ్ సిస్టమ్స్ (ఏసీఈ), ప్రొడక్షన్, కోఆర్డినేషన్ ,సర్వీసెస్ ఇంటరాక్షన్ (పీసీ అండ్ ఎస్ఐ) విభాగాల డైరెక్టర్లు జనరల్స్‌తో పాటు ప్రముఖ శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే, టిఏఎస్ఎల్, పుణె సీఈఓ, ఎండీ, బీఎఫ్ఎల్, పుణె వైస్ ఛైర్మన్, జాయింట్ ఎండీతో పాటు ఇతర పరిశ్రమ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

వాహనాల పరిశోధన, అభివృద్ధి సంస్థ, ఆయుధాల పరిశోధన,అభివృద్ధి సంస్థ, రక్షణ మెటలర్జికల్ పరిశోధన ప్రయోగశాల, హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ, కాంబాట్ వాహనాల పరిశోధన, అభివృద్ధి సంస్థ, రీసెర్చ్, డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఇంజినీర్స్) వంటి వివిధ డీఆర్డీఓ ప్రయోగశాలల డైరెక్టర్లు, శాస్త్రవేత్తలు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# వైద్య రంగంలో అంతరాలను తొలగిస్తూ.. వెనకబడిన వర్గాలకు కీలకమైన క్యాన్సర్ చికిత్సను అందిస్తోన్న ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:నేడు జైపూర్‌లోని భగవాన్ మహావీర్ క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 23వ క్యాన్సర్ విజేతల దినోత్సవం వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. క్యాన్సర్ విజేతల దినోత్సవం అనేది కేవలం ఒక రోజు కాదని, అది అచంచలమైన ఆశకు, మానవ స్ఫూర్తి అసాధారణ ధైర్యానికి నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన భగవాన్ మహావీర్ క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధనా కేంద్రం, కేజీ కొఠారి మెమో రియల్ ట్రస్టు ప్రతినిధులను ఆయన అభినందించారు. 1997లో ప్రారంభమైన నాటి నుంచి ఈ ఆసుపత్రి క్యాన్సర్ సంరక్షణలో అందిస్తున్న ఆదర్శప్రాయమైన సేవలను ఆయన గుర్తు చేశారు. అంకితభావంతో, మానవీయ కోణంలో చికిత్స అందిస్తూ ఈ సంస్థ ఎందరో బాధితుల జీవితాల్లో వెలుగులు నింపిందని ప్రశంసించారు.

దేశంలో క్యాన్సర్ వ్యాధి విస్తరిస్తున్న తీరుపై ఉపరాష్ట్రపతి ఆందోళన వ్యక్తం చేశారు. ఐసీఎంఆర్ జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీ గణంకాల ప్రకారం.. దేశంలో ప్రతి ఏటా సుమారు 15 లక్షలకు పైగా కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో క్యాన్సర్ నివారణ, వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, అత్యాధునిక చికిత్స, రోగుల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం అనేక పటిష్టమైన చర్యలు, కార్యక్రమాలు ప్రారంభించిందని ఉపరాష్ట్రపతి చెప్పారు.

ఆయుష్మాన్ భారత్-ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కింద ఇప్పటి వరకు సుమారు రూ.13,000 కోట్లకు పైగా వ్యయంతో 68 లక్షల మందికి పైగా క్యాన్సర్ బాధితులకు చికిత్స అందించినట్లు ఉపరాష్ట్రపతి వెల్లడించారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారిలో దాదాపు 75 శాతం మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే ఉన్నారని, ఆరోగ్య సేవల్లో ఉన్న అంతరాలను తొలగించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు.

దేశవ్యాప్తంగా ప్రతి జిల్లా ఆసుపత్రిలో డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, ఇప్పటికే 450కి పైగా కేంద్రాలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని ఉపరాష్ట్రపతి తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు, జిల్లా ఉప-విభాగ ఆసుపత్రులలో నిత్యావసర ఔషధాల జాబితాలో క్యాన్సర్ నిరోధక మందులను చేర్చడం వంటి జాతీయ ఆరోగ్య మిషన్ కింద చేపట్టిన కార్యక్రమాలను కూడా ఆయన ప్రస్తావించారు.

వ్యాధి నివారణ చర్యల ప్రాధాన్యతను వివరిస్తూ.. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను అరికట్టేందుకు ఈ ఏడాది ప్రారంభించిన దేశవ్యాప్త హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం గురించి ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధకృష్ణన్ ప్రస్తావించారు. సుమారు కోటి మంది బాలికలకు ఈ టీకాని అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ దిశగా విశేష కృషి చేస్తున్న కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖను, రాజస్థాన్ ప్రభుత్వాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

దేశవ్యాప్తంగా ఉన్న క్యాన్సర్ చికిత్స సంస్థల మధ్య బలమైన సమన్వయం, పరస్పర అభ్యాసం అవసరమని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. క్యాన్సర్ సంరక్షణలో వస్తున్న అత్యాధునిక సాంకేతిక పురోగతిని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నింటిలోనూ పరస్పరం పంచుకోవాలని ఆయన సూచించారు. తద్వారా మెరుగైన ఫలితాలు సాధించడంతో పాటు, నాణ్యమైన చికిత్స అందరికీ అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. సంస్థల మధ్య మరింత సహకారం, అవగాహన క్యాన్సర్‌పై దేశం చేస్తున్న పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.

ధూమపానం, పొగాకు వాడకం, మాదకద్రవ్యాల వినియోగం, అనారోగ్యకరమైన ఫాస్ట్ ఫుడ్ అలవాట్ల వల్ల కలిగే దుష్ప్రభావాలపై నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో జీవనశైలి మార్పులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

క్యాన్సర్ నుంచి కోలుకున్న వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. వారి అసాధారణమైన పట్టుదల, సంకల్పం కలిగిన 'యోధులు'గా ఉపరాష్ట్రపతి అభివర్ణించారు. వారి పోరాట ప్రయాణం ఇతరులకు ఆశాకిరణంలా నిలుస్తుందని ప్రశంసించారు. అంకితభావంతో, కరుణతో నిరంతరం సేవలు అందిస్తున్న వైద్యులకు, సంరక్షకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

భగవాన్ మహావీర్ క్యాన్సర్ ఆసుపత్రి చేపడుతున్న విస్తృతమైన సేవా కార్యక్రమాలను ఉపరాష్ట్రపతి అభినందించారు. వ్యాధిని ముందస్తుగా గుర్తించి ప్రాణాలను కాపాడటంలో ఆసుపత్రి నిర్వహిస్తున్న స్క్రీనింగ్ ప్రచారాలు, మొబైల్ వైద్య విభాగాలు, వీధి నాటకాలు, విద్యా సంబంధిత ఉపన్యాసాలు, కమ్యూనిటీ క్యాంపులు వంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతున్నాయని కొనియాడారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచడానికి తొలిస్థాయిలోనే వ్యాధిని గుర్తించాలనీ, క్యాన్సర్‌తో ఎవరూ ఒంటరిగా పోరాడకుండా సమష్టి ప్రయత్నాలు జరగాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. క్యాన్సర్ విజేతల గాథల నుంచి ప్రజలు స్ఫూర్తి పొందాలని కోరారు. భయంపై ఆశ విజయం సాధించే సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌ను జయించిన పలువురు విజేతలను ఉపరాష్ట్రపతి ఘనంగా సన్మానించారు. వారి అసాధారణ ధైర్యాన్ని, పట్టుదలను గుర్తించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ గవర్నర్ శ్రీ హరిభౌ కిషన్‌రావ్ బాగ్డే, రాజస్థాన్ వైద్య మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ ఖిమ్సర్, భగవాన్ మహావీర్ క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్ శ్రీ నవరతన్ కొఠారి ఇతర అతిథులు పాల్గొన్నారు.

# ఎంజీయూలో డిజిటల్ లైబ్రరీ, ల్యాబ్స్ ప్రారంభం

నల్గొండ, ఏప్రిల్ 27: నల్లగొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ప్రధాన గ్రంథాలయంలో డిజిటల్ లైబ్రరీని సోమవారం వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ లైబ్రరీతో విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు ప్రపంచ స్థాయి సమాచారం, పరిశోధనలు, గ్రంథాలు అందుబాటులోకి వస్తాయన్నారు. విద్యార్థులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని ముందుకు సాగాలన్నారు. ఇక మీదట తాను సైతం నెలలో ఒకరోజు విద్యార్థులతో పాటు గ్రంథాలయంలో పఠనానికి విధిగా హాజరు కానున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి, డా.కె. ప్రేమ్‌సాగర్, ఇంజనీర్ శైలజ, లైబ్రేరియన్ బుచ్చి రాములు పాల్గొన్నారు.

## ప్రయోగశాలలు ప్రారంభం

వర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ ప్రయోగశాలలను వీసీ నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యలో ప్రత్యక్ష అనుభవం, జ్ఞానం అందించే అధునాతన ప్రయోగశాలలు అందుబాటులో రావడం సంతోషకరమన్నారు. మొత్తం తొమ్మిది ప్రయోగశాలలను ఆయన ప్రారంభించారు.


1. ఇంజినీరింగ్ వర్క్షాప్ ల్యాబ్, 2. ఇంజినీరింగ్ గ్రాఫిక్స్ ల్యాబ్, 3. ఎలక్ట్రికల్ డి.సి మోటార్స్ ల్యాబ్, 4. డి.సి జనరేటర్స్ ల్యాబ్, 5. ఏ.సి జనరేటర్స్ ల్యాబ్, 6. పవర్ సిస్టమ్స్ ల్యాబ్, 7. ఇంజినీరింగ్ కెమిస్ట్రీ ల్యాబ్, 8. ఇంజినీరింగ్ ఫిజిక్స్ ల్యాబ్, 9. ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ ల్యాబ్ లను ఉప కులపతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రేఖ, డా హరీష్ కుమార్, డా జయంతి, డా.సిహెచ్ సుధారాణి, ఆచార్య సాంబశివరావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వారణాసి భవాని పేరుతో స్వర్ణ పతకానికి రూ.3 లక్షల విరాళం

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో చదివే విద్యార్థినుల విద్యా ప్రతిభను ప్రోత్సహించేందుకు ఎమ్మెస్సీ జువాలజీ విభాగంలో టాపర్‌గా నిలిచిన విద్యార్థినికి ప్రదానం చేయనున్న "వారణాసి భవాని" జ్ఞాపకార్థం స్వర్ణ పతకం కోసం రూ.3 లక్షల చెక్కును రిజిస్ట్రార్‌కు కుటుంబ సభ్యుడు బి.వీరభద్ర ప్రసాద్ అందజేశారు. విద్యార్థినుల కృషి, ప్రతిభ, ఉన్నత విద్యలో సాధిస్తున్న విజయాలను గౌరవిస్తూ ఈ స్వర్ణ పతకం ఏర్పాటు చేయడం విశేషమని పేర్కొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం వారణాసి భవాని జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ స్వర్ణ పతకం ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థినులకు మరింత స్ఫూర్తి, ఉత్తేజం కలుగుతుందని, భవిష్యత్తులో వారు పరిశోధన, ఉన్నత విద్య, ఉద్యోగ రంగాల్లో అద్భుతంగా రాణించేందుకు ఇది ప్రేరణగా నిలుస్తుందని వీసీ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఓఈ డా.జి. ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# తెలంగాణలో జనగణన 2027 స్వీయ-నమోదు ప్రారంభం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:జనగణన-2027 కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో స్వీయ నమోదు ప్రక్రియను ఈరోజు అధికారికంగా ప్రారంభించారు. లోక్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా ఆన్‌లైన్ ద్వారా స్వయంగా తన వివరాలను నమోదు చేసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, జనాభా గణన ఒక కీలక జాతీయ కార్యక్రమమని పేర్కొన్నారు. ఇది దేశంలోని జనాభా, వారి సామాజిక ఆర్థిక పరిస్థితులపై సమగ్ర సమాచారం అందించడంతో పాటు, సమర్థవంతమైన ప్రణాళిక, సుపరిపాలన, వనరుల సమాన పంపిణీకి పునాదిగా నివిద్య, ఆరోగ్యం, ఉపాధి, గృహనిర్మాణం, మౌలిక సదుపాయాల వంటి రంగాలలో విధానాల రూపకల్పనలో జనగణన ముఖ్య పాత్ర పోషిస్తుందని ఆయన వివరించారు. కచ్చితమైన సమాచారంతో లక్షిత సంక్షేమ పథకాలు రూపొందించడమే కాకుండా, దేశ పురోగతిని సమర్థవంతంగా అంచనా వేయడానికి ఇది సహకరిస్తుందని అన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ఇదే మొదటి జనాభా గణన కావడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుందని గవర్నర్ పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి కోసం ఖచ్చితమైన డేటా సేకరణ అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణలో స్వీయ గణన దశ ఏప్రిల్ 26, 2026 నుంచి మే 10, 2026 వరకు కొనసాగుతుంది. అనంతరం మే 11 నుంచి జూన్ 9, 2026 వరకు గృహ జాబితా కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఇది దేశంలో మొట్టమొదటి పూర్తి డిజిటల్ జనగణన కావడం విశేషం. స్వీయ నమోదు ప్రక్రియ సులభం, సౌకర్యవంతం, వినియోగదారులకు అనుకూలంగా రూపొందించబడిందని తెలిపారు.

తాను స్వయంగా ఈ ప్రక్రియను పూర్తి చేశానని, ఇది సరళంగా, సమర్థవంతంగా ఉందని గవర్నర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, కచ్చితమైన సమాచారం అందించి జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజల భాగస్వామ్యం ద్వారా బలమైన, సమ్మిళితమైన, సుస్థిరమైన తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుందని గవర్నర్ తన సందేశంలో పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సెన్సెస్ డైరెక్టర్ శ్రీమతి భారతీ హోళికేరి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, గవర్నర్ సంయుక్త కార్యదర్శి కె. శశి కిరణాచారి తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక ఐక్యతను నిలబెట్టే శక్తి సాహిత్య సంగీత ప్రపంచానిదే : భీమ్స్ సిసిరోలియో

నల్గొండ, ఏప్రిల్ 27: మనిషిని మనిషిని కలిపే పేగు బంధం, సమాజ సమతుల్యతను కాపాడేది సాహిత్య సాంస్కృతిక రంగాలదేనని ప్రముఖ సంగీత దర్శకుడు, రచయిత, గాయకుడు భీమ్స్ సిసిరోలియో అన్నారు. మనిషి కష్టసుఖాలకు, మానవ జీవన పరిణామ క్రమానికి నిలువెత్తు రూపం పాట, సంగీతం అన్నారు. "తెర" సాంస్కృతిక కళామండలి 33వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి కోదాడలో కళా పురస్కారాన్ని భీమ్స్ సిసిరోలియో, సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవి, గాయకుడు చింతల యాదగిరికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో సంగీత దర్శకుడు భీమ్స్ మాట్లాడుతూ తన పాతికేళ్ల సాంస్కృతిక ప్రయాణానికి గుర్తుగా "తెర" సాంస్కృతిక కళా మండలి అవార్డును గౌరవంగా స్వీకరిస్తున్నానని తెలిపారు. దేహాన్ని తునాతునకలు చేయవచ్చును కానీ ఆ ముక్కలైన దేహం నుంచి పుట్టుకొచ్చిన పాటను, కవితను ఎవరూ చంపలేరన్నారు.



చింతల యాదగిరి మాట్లాడుతూ.. నా చిట్టి చేతులు చక్కని రాతలు రాయలేదమ్మా అని సాహిత్య సాంస్కృతిక సంతకం చేయించింది తెలంగాణ మట్టి అని తెలిపారు. పోరాట స్ఫూర్తినిచ్చి పాటల ఉగ్గు పాలు తాపి నేర్పిన మట్టి పాఠాల్ని పాటలుగా అల్లుకుంటూ పోతున్నామన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఒక్క దగ్గరికి చేర్చి నిలబెట్టగల శక్తి సాహిత్య సాంస్కృతిక రంగాలకు మాత్రమే ఉందని చెప్పారు. రాష్ట్ర సాహిత్య, సాంస్కృతిక,నాటక కళా రంగాల చరిత్రలో రేపాల కూచిపూడి, నడిగూడెం, కోదాడ లు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఈ నేపథ్యం నుంచే కోదాడ తెలంగాణ సాహిత్య సాంస్కృతిక ముఖద్వారంగా నిలిచిపోయిందని చెప్పారు. కోదాడ పట్టణంలో రవీంద్ర భారతి లాంటి ఆడిటోరియం నిర్మాణం చేయాలని ఈ ప్రాంత నాయకులను, ప్రజా ప్రతినిధులను, జిల్లా మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డిని కోరారు. 33 సంవత్సరాల తెర కళామండలి నిర్వాహకుడిగా వేముల వెంకటేశ్వర్లు చేస్తున్న అవిరాళ కృషిని జూలూరు ప్రశంసించారు.

ఈ సభకు కవి పెద్దిరెడ్డి గణేష్ అధ్యక్షత వహించగా మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట రత్నం, ఆర్థిక శాస్త్ర నిపుణుడు డాక్టర్ అందే సత్యం, రామానంద తీర్థ గ్రామీణ విద్యా సంస్థ చైర్మన్ నారా కిషోర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు వంగవీటి రామారావు, మాజీ సర్పంచ్ పార సీతయ్య, బద్దం భద్రారెడ్డి, కళాశ్రీ భిక్షు నాయక్, సింగర్ శిరీష, దామిని చింతల, బోల్లెద్దు శ్రీపాల్, కే.సీతా రాములు, ఎం.ఈ.ఓ.సలీం షరీఫ్, ఎల్బీనగర్ ఏసీపీ అమరగాని కృష్ణయ్య, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి, కౌన్సిలర్స్ కర్రి సుబ్బారావు, గుండపనేని పద్మ నాగేశ్వరరావు, తోట జ్యోతి శ్రీను, కట్టబోయిన శ్రీనివాస్ యాదవ్, తెర కళామండలి సభ్యులు షేక్ మీరా, షేక్ పీర్ సాహెబ్, కోలా శ్రీనివాసరావు, పాలూరి సత్యనారాయణ, పోలిశెట్టి బ్రహ్మం, గార్లపాటి వీరారెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

# హర్దోయ్‌లో 594 కిలోమీటర్ల పొడవైన, యాక్సెస్-కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ గంగా ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ నెల 28-29 తేదీల్లో ఉత్తర ప్రదేశ్‌లో పర్యటించనున్నారు. ఈ నెల 28 సాయంత్రం సుమారు 5 గంటలకు వారణాసిలో జరిగే మహిళా సమ్మేళనంలో ప్రధానమంత్రి పాల్గొంటారు. అక్కడ ఆయన సుమారు రూ. 6,350 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సభనుద్దేశించి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగిస్తారు.

ఈ నెల 29న ఉదయం సుమారు 8:30 గంటలకు వారణాసిలోని శ్రీ కాశీ విశ్వనాథ ఆలయాన్ని ప్రధానమంత్రి దర్శించి, పూజలు నిర్వహిస్తారు. ఆ రోజున ఉదయం సుమారు 11:30 గంటలకు ప్రధానమంత్రి హర్దోయ్‌కు చేరుకుని గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సభలోనూ ఆయన ప్రసంగిస్తారు.

ఈ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యే మహిళా సమ్మేళనంలో ప్రధానమంత్రి పాల్గొంటారు. రూ. 1,050 కోట్లకు పైగా విలువైన 48 ప్రాజెక్టులను ప్రధానమంత్రి జాతికి అంకితం చేస్తారు. వారణాసి-అజంగఢ్ రహదారి విస్తరణ పూర్తి చేయడం... కజక్‌పురా, కదిపూర్‌లలో కీలకమైన రైల్ ఓవర్ బ్రిడ్జిలను ప్రారంభించడం... భగవాన్‌పూర్‌లో 55 ఎమ్ఎల్‌డీల సామర్థ్యం గల మురుగునీటి శుద్ధి కర్మాగారం (ఎస్‌టీపీ)ను ప్రారంభించడం వంటివి ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో భాగంగా ఉన్నాయి.

సమాజ కేంద్రితమైన పలు ప్రాజెక్టులనూ ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. జల్ జీవన్ మిషన్ కింద 30 గ్రామీణ తాగునీటి పథకాలు, చంద్రావతి ఘాట్ పునరాభివృద్ధి, సారనాథ్ సమీపంలోని సారంగనాథ్ ఆలయ పర్యాటకాభివృద్ధి, నాగ్వాలోని సంత్ రవిదాస్ పార్క్ సుందరీకరణ, పునరుద్ధరణ పనులు వీటిలో భాగంగా ఉన్నాయి. ప్రజా సేవలు, క్రీడల రంగాలను మెరుగుపరచే పలు కార్యక్రమాలూ ఉన్నాయి. యూపీ కళాశాలలో సింథటిక్ హాకీ టర్ఫ్, రామ్‌నగర్‌లో 100 పడకల వృద్ధాశ్రమం, భేలుపూర్ నీటి శుద్ధి కర్మాగారంలో 1 మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు వీటిలో భాగంగా ఉన్నాయి. సాంప్రదాయిక వైద్య విధానాలను ఆధునిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలతో అనుసంధానించడం పట్ల ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తూ... సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ టిబెటన్ స్టడీస్‌లో సోవా రిగ్పా భవన్, ఆసుపత్రినీ ప్రధానమంత్రి ప్రారంభిస్తారు.

సుమారు రూ. 5,300 కోట్ల విలువైన 112కు పైగా ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. వీటిలో అమృత్ 2.0 కింద చేపట్టే 13 మురుగునీటి శుద్ధి, నీటి సరఫరా పథకాలు... శ్రీ శివ ప్రసాద్ గుప్తా డివిజనల్ జిల్లా ఆసుపత్రిలో 500 పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి... భోజువీర్, సిగ్రాలో మార్కెట్ కాంప్లెక్సులు, కార్యాలయాల నిర్మాణం... చెరువుల పునరుద్ధరణ, పునరుజ్జీవనం... 198 పడకల ఆసుపత్రి పునరాభివృద్ధి... 100 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణం... అస్సీ ఘాట్, దశాశ్వమేధ ఘాట్, నమో ఘాట్ వంటి కీలక ఘాట్‌లలో పర్యాటక సౌకర్యాల అభివృద్ధి కార్యక్రమాలు వీటిలో భాగంగా ఉన్నాయి. పరిపాలన, సామాజిక సంక్షేమ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు గానూ రామ్‌నగర్‌లో ఇంటిగ్రేటెడ్ డివిజనల్ ఆఫీస్, నగర నిగమ్ కార్యాలయ భవనం, ప్రభుత్వ బాలల సంరక్షణ గృహం, జువెనైల్ జస్టిస్ బోర్డుకూ ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. బనాస్ డెయిరీతో అనుబంధం ఉన్న ఉత్తరప్రదేశ్ పాల సరఫరాదారులకు రూ. 105 కోట్లకు పైగా మొత్తాన్ని ప్రధానమంత్రి బోనస్‌గా బదిలీ చేయనున్నారు.

గంగా నదిపై రైలు-రోడ్డు వంతెన నిర్మాణం సహా, వారణాసి జంక్షన్ ? పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్ మూడో, నాల్గో రైల్వే లైన్ ప్రాజెక్టుకూ ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్టు రైలు రద్దీని తగ్గించడం, రవాణా సామర్థ్యాన్ని పెంచడం, బహుళ రవాణా అనుసంధానాన్ని బలోపేతం చేయడం, సులభమైన ట్రాఫిక్ రాకపోకలను నిర్ధారించడం ద్వారా వారణాసి, చందౌలి జిల్లాలకు ప్రయోజనం చేకూరస్తుంది. ఇది కాశీ విశ్వనాథ్ ధామ్, రామ్‌నగర్ ప్రాంతం, జాతీయ రహదారి-19కి ప్రవేశాన్ని మెరుగుపరచడంతో పాటు... తూర్పు ఉత్తరప్రదేశ్, బీహార్‌లతో రైలు అనుసంధానాన్నీ బలోపేతం చేస్తుంది.

బనారస్‌పూణే (హడప్సర్), అయోధ్య-ముంబయి (లోకమాన్య తిలక్ టెర్మినస్) అనే రెండు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లనూ ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ రైళ్లు సరసమైన, ఆధునిక ప్రయాణ సౌకర్యాలను అందించడంతో పాటు ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తాయి. బనారస్-పూణే సర్వీస్ కాశీ విశ్వనాథ ధామ్‌కు సులభంగా చేరుకోవడానికి వీలు కల్పిస్తుండగా, అయోధ్య-ముంబయి సర్వీస్ శ్రీ రామ్ మందిర్ తీర్థ క్షేత్రానికి అనుసంధానాన్ని మెరుగుపరుస్తూ, ప్రముఖ పుణ్యక్షేత్రాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేస్తుంది.

దేశంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలిచే గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రధానమంత్రి హర్దోయ్ జిల్లాలో ప్రారంభించనున్నారు. గంగా ఎక్స్‌ప్రెస్‌వే 594 కిలోమీటర్ల పొడవు, 6 లేన్‌లు (8 లేన్‌ల వరకు విస్తరించగలవి), యాక్సెస్-నియంత్రిత గ్రీన్‌ఫీల్డ్ హై-స్పీడ్ కారిడార్ కలిగి ఉంది. దీనిని సుమారు రూ. 36,230 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వే మీరట్, బులందషహర్, హాపూర్, అమ్రోహా, సంభాల్, బదౌన్, షాజహాన్‌పూర్, హర్దోయ్, ఉన్నావ్, రాయ్‌బరేలి, ప్రతాప్‌గఢ్, ప్రయాగ్‌రాజ్ వంటి 12 జిల్లాల గుండా వెళుతుంది. తద్వారా ఇది ఉత్తర ప్రదేశ్‌లోని పశ్చిమ, మధ్య, తూర్పు ప్రాంతాలను ఒకే నిరంతరాయ హై-స్పీడ్ కారిడార్ ద్వారా అనుసంధానిస్తుంది.

ఈ ప్రాజెక్ట్ ద్వారా మీరట్, ప్రయాగరాజ్ మధ్య ప్రయాణ సమయం ప్రస్తుతం తీసుకునే 10-12 గంటలు..సుమారు 6 గంటలకు తగ్గుతుంది. దీని ద్వారా రవాణాలో సౌలభ్యం, సామర్థ్యం మెరుగుపడతాయని అంచనా.

ఈ ప్రాజెక్టులోని ఒక ముఖ్యమైన విశేషం... షాజహాన్‌పూర్ జిల్లాలో 3.5 కిలోమీటర్ల పొడవైన అత్యవసర ల్యాండింగ్ సౌకర్యాన్ని (విమానాశ్రయాన్ని) ఏర్పాటు చేయడం. ఈ ద్వంద్వ ప్రయోజన మౌలిక సదుపాయం జాతీయ భద్రతా సంసిద్ధతను పెంపొందించి, ఆర్థిక ప్రయోజనాలకు మించి వ్యూహాత్మక విలువనూ చేకూరుస్తుంది.

గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ఒక ప్రధాన ఆర్థిక కారిడార్‌గా భావిస్తున్నారు. దీని మార్గంలో ఉన్న 12 జిల్లాల్లో సుమారు 2,635 హెక్టార్లలో సమీకృత ఉత్పాదక, లాజిస్టిక్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వే లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించి, రవాణా వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరిచి, ఉత్పాదక రంగ సమర్థతనూ పెంచుతుంది.

మెరుగైన అనుసంధానం ద్వారా రైతులకు పట్టణాలు, ఎగుమతి మార్కెట్లు నేరుగా అందుబాటులోకి రానున్నాయి. ఇది వారి పంటలకు మంచి ధర లభించడానికి, గ్రామీణ ఆదాయాలు బలపడటానికి దోహదపడుతుంది. పర్యాటకాన్ని ప్రోత్సహించడం, కొత్త ఆర్థిక అవకాశాలను అందుబాటులోకి తేవడం, ఈ ప్రాంతం అంతటా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం.


ఆగ్రా - లక్నో ఎక్స్‌ప్రెస్‌వే, జేవార్ లింక్ ఎక్స్‌ప్రెస్‌వే, ఫరూఖాబాద్ లింక్ ఎక్స్‌ప్రెస్‌వే, మీరట్ నుంచి హరిద్వార్ వరకు ప్రతిపాదిత పొడిగింపు సహా... ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న, ప్రణాళికలో ఉన్న అనేక అనుసంధాన కారిడార్లతో గంగా ఎక్స్‌ప్రెస్‌వే రాష్ట్రంలోని విస్తృత ఎక్స్‌ప్రెస్‌వే నెట్‌వర్క్‌కు వెన్నెముకగా నిలవనుంది. అభివృద్ధి చెందుతున్న ఈ ఎక్స్‌ప్రెస్‌వే గ్రిడ్... ఉత్తర ప్రదేశ్ అంతటా తూర్పు నుంచి పశ్చిమానికి, ఉత్తరం నుంచి దక్షిణానికి హై-స్పీడ్ రహదారి అనుసంధానాన్ని విస్తరింపజేసి, సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి వీలు కల్పిస్తుంది.

గంగా ఎక్స్‌ప్రెస్‌వే కేవలం ఒక రవాణా ప్రాజెక్ట్ మాత్రమే కాదు. ఇది రవాణా ఖర్చులను తగ్గించి, పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించి, వ్యవసాయ-గ్రామీణ ఆదాయాలను పెంచి, ఉపాధిని కల్పించి, రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ ఆర్థిక వృద్ధిని సాధించే ఒక పరివర్తనాత్మక కార్యక్రమం.

## వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్టు

నల్గొండ, ఏప్రిల్ 27: రాత్రుల్లో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగను ఖమ్మం సిసిఎస్, కారేపల్లి పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్ కు తరలించినట్లు కారేపల్లి ఎస్ఐ గోపి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వివరాలు వెల్లడించారు. ఖమ్మం ఖిల్లా బజార్ చెందిన ఎండీ.మతిన్ ఆరు కేసుల్లో ప్రధాన నిందుతుడని, కారేపల్లి పోలీస్ స్టేషన్ లో మూడు చోరి కేసులు నమోదు కాగా మధిర, బోనకల్, పెద్దపల్లి జిల్లాలో ఒక్కొక్క కేసు నమోదైనట్లు తెలిపారు. ఆయా కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టి నిందితుడిని కారేపల్లి ఆటో స్టాండ్ వద్ద దొంగను గుర్తించి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితుడి నుండి నుంచి సుమా రు మూడు తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

# తెలంగాణ 2027 జనాభా లెక్కల స్వీయ గణనలో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీ జీ. కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:2027 జనాభా లెక్కలకు సంబంధించి తెలంగాణలో 2026 ఏప్రిల్ 26న స్వీయ గణన అధికారికంగా ప్రారంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ. కిషన్ రెడ్డి.. నిర్ణీత ఆన్‌లైన్ జనగణన పోర్టల్ ద్వారా తన వివరాలను నమోదు చేశారు.

తెలంగాణ జనగణన కార్యాలయం ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి ప్రయాణంలో జనాభా లెక్కలు ఒక పునాది రాయి వంటివని అన్నారు. ప్రణాళికా రచన, సుపరిపాలన, సమానాభివృద్ధికి ఇవి కీలక సాధనాలుగా ఆయన అభివర్ణించారు. సమర్థవంతమైన విధాన రూపకల్పన, సమ్మిళిత వృద్ధికి ఖచ్చితత్వంతో కూడిన సమగ్రమైన గణాంకాలు చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు.

2027 జనాభా లెక్కల ప్రాముఖ్యతను వివరించిన శ్రీ జీ. కిషన్ రెడ్డి? ఆధునిక డిజిటల్ సాంకేతికతను ఉపయోగించటం ద్వారా ఇదొక పరివర్తనాత్మక దశగా నిలుస్తుందని పేర్కొన్నారు. తద్వారా పారదర్శకత, సామర్థ్యం, సమ్మిళితత్వం మరింత పెరుగుతాయని ఆయన అన్నారు. 2026 ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ గణన సౌకర్యం అందుబాటులో ఉంటుందని.. ఆ తర్వాత 2026 మే 11 నుంచి జూన్ 9 వరకు గృహ జాబితా సేకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇది సమగ్ర సమాచార సేకరణకు బలమైన పునాది వేస్తుందని ఆయన వివరించారు.

దేశవ్యాప్తంగా ఉన్న సామాజిక-ఆర్థిక పరిస్థితులపై 2027 జనాభా లెక్కలు స్పష్టమైన అవగాహనను కల్పిస్తాయని.. అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడటంలో ఇవి సహాయపడతాయని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు.

జనాభా లెక్కల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరిన కేంద్ర మంత్రి.. ఇందులో ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. సేకరించే ప్రతి సమాచారం దేశ భవిష్యత్తుతో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్' స్వప్నాన్ని సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ జనాభా లెక్కల డైరెక్టరేట్ సంచాలకులు భారతి హోళికేరి మాట్లాడుతూ.. అధికారిక వెబ్‌సైట్ అయిన స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేయవచ్చని, తద్వారా జనాభా లెక్కల్లో నేరుగా పాల్గొనవచ్చని తెలిపారు. సమర్పించిన సమాచారం పూర్తి గోప్యంగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. సమాచారాన్ని సమర్పించిన వెంటనే ఒక 'స్వీయ గణన ఐడీ' వస్తుందని.. ఆ తర్వాత జనగణన అధికారి (ఎన్యూమరేటర్) దానిని పరిశీలించి ఖరారు చేస్తారని ఆమె వివరించారు.

ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్. వీ. కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా తదితరులు పాల్గొన్నారు.

# డీలిమిటేషన్ బిల్లుపై కేంద్రం కుట్ర : పల్లా వెంకట్‌రెడ్డి

నల్గొండ, ఏప్రిల్ 27: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ కుట్రలు, కుతంత్రాలతోనే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టిందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి విమర్శించారు. సిపిఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డీలిమిటేషన్‌కు 2031 సంవత్సరం వరకు గడువు ఉన్నప్పటికీ, 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హడావుడిగా ఈ బిల్లును ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే విధంగా బీజేపీ ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలతో డీలిమిటేషన్ బిల్లును తీసుకువచ్చిందని మండిపడ్డారు. అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా, శాస్త్రీయ పద్ధతిలో డీలిమిటేషన్ జరగాలని అభిప్రాయపడ్డారు.

**రైతులను ఇబ్బందులకు గురిచేయడం ఆపాలి**

సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు వడ్లను పూర్తిగా ఎండబెట్టి, తేమ లేకుండా తీసుకువచ్చినప్పటికీ తాలు పేరుతో క్వింటాలుకు 5 నుంచి 6 కిలోల వరకు కోత విధించడం అన్యాయమని మండిపడ్డారు. అదనపు తూకం, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెట్టుబడులతో ఇబ్బందులు పడుతూ పెద్దఎత్తున వరి ధాన్యాన్ని పండించి రైతులు అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తున్నప్పటికీ, కొనుగోలు ప్రక్రియలో అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రైతుల శ్రమను దోపిడీ చేసే ఈ చర్యలను ప్రభుత్వం తక్షణమే అరికట్టి కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా మే 1వ తేదీన అన్ని గ్రామాలు, పట్టణాలు, కార్మిక అడ్డాల్లో ఎర్ర జెండాలు ఎగురవేసి ర్యాలీలు, సభలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి గురిజ రామచంద్రం అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, ఉజ్జిని యాదగిరి రావు, ఆర్.అంజయ్యచారి, బంటు వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య, తుమ్ము బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# గ్యాంగ్‌టక్‌లో సిక్కిం రాష్ట్ర 50వ అవతరణోత్సవాల ముగింపు వేడుకల్లో పాల్గొన్న ప్రధాని

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 27:2026 ఏప్రిల్ 27, 28 తేదీల్లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సిక్కింలో పర్యటించనున్నారు. ఏప్రిల్ 27న మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆయన గ్యాంగ్‌టక్ చేరుకుంటారు. ఏప్రిల్ 28న ఉదయం దాదాపు 9:30 గంటలకు గ్యాంగ్‌టక్‌లోని ఆర్కిడేరియాన్ని ప్రధానమంత్రి సందర్శిస్తారు. సిక్కిం రాష్ట్ర పర్యావరణ, పుష్ప వైభవాన్ని చాటేలా.. అత్యాధునిక, ప్రపంచ స్థాయి ఆర్కిడ్ అనుభూతి కేంద్రంగా స్వర్ణజయంతి మైత్రీ మంజరి పార్కును అభివృద్ధి చేశారు.

అనంతరం ఉదయం దాదాపు 10 గంటల సమయంలో పాల్జోర్ స్టేడియంలో సిక్కిం 50వ రాష్ట్ర అవతరణోత్సవాల ముగింపు కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొంటారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రూ. 4,000 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి సభనుద్దేశించి ప్రసంగిస్తారు.

మౌలిక సదుపాయాలు, రవాణా, ఆరోగ్య రక్షణ, విద్య, విద్యుత్, పట్టణాభివృద్ధి, పర్యావరణం, పర్యాటకం, వ్యవసాయం వంటి అనేక రంగాలకు చెందిన ఈ ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి. సిక్కింలో సంపూర్ణ, సమ్మిళిత అభివృద్ధిని వేగవంతం చేయడమే వీటి లక్ష్యం.

వైద్య రంగంలో భాగంగా.. నామ్చి జిల్లాలోని యాంగాంగ్‌లో 100 పడకల ఆయుర్వేద ఆస్పత్రికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. అలాగే ఎన్ఐటీ డియోరాలి వద్ద 30 పడకల సమీకృత సోవా రిగ్పా ఆస్పత్రిని ఆయన ప్రారంభిస్తారు. తద్వారా రాష్ట్రంలో సంప్రదాయ, సమగ్ర వైద్య విధానాలు ప్రజలకు మరింత మెరుగ్గా అందుబాటులోకి వస్తాయి.

విద్యా రంగం విషయానికొస్తే.. యాంగాంగ్‌లో సిక్కిం విశ్వవిద్యాలయం శాశ్వత ప్రాంగణాన్ని, చాకుంగ్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూనివర్సిటీ ఆఫ్ ఎక్సలెన్స్ వరిపాలన విభాగాన్ని, గ్యాంగ్‌టక్ జిల్లా సోచేగాంగ్‌లో హెలెన్ లెప్చా వైద్య కళాశాలను, గ్యాల్‌షింగ్ జిల్లా డెంటమ్‌లో డెంటమ్ ప్రొఫెషనల్ కాలేజీని ప్రధాన మంత్రి ప్రారంభిస్తారు. వీటితోపాటు హీ గ్యాథంగ్‌లో ఆదర్శ ఆవాస పాఠశాలలను, మాంగన్ జిల్లా మాంగ్శిలాలో కొత్త ఆదర్శ డిగ్రీ కాలేజీని, నామ్చి జిల్లా బూంతార్ గుంపాలో మొనాస్టిక్ హాస్టల్- క్లాస్‌రూమును ఆయన ప్రారంభిస్తారు. అలాగే సిక్కింలోని 160 పాఠశాలల్లో ఐటీ ఆధారిత విద్యా మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలును కూడా శ్రీ మోదీ ప్రారంభిస్తారు.

సిక్కింలో రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచడం కోసం.. నామ్చి, గ్యాంగ్‌టక్ జిల్లాలను కలుపుతూ సిర్వాని, దిగువ శామ్‌డాంగ్ వద్ద తీస్తా నదిపై నిర్మించనున్న రెండు వరుసల హింజ్డ్ స్టీల్ ఆర్చ్ వంతెనలు రెండింటికి ప్రధాన మంత్రి శంకుస్థాపన చేస్తారు. వీటితోపాటు బిర్ధాంగ్ నుంచి కిచ్చుదుమ్రా మీదుగా నామ్చి వరకు ఉన్న రహదారి విస్తరణ, బలోపేతం పనులను కూడా ఆయన ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టుల వల్ల జిల్లాల మధ్య రాకపోకలు సులభతరమవ్వడమే కాకుండా, ప్రయాణ సామర్థ్యం పెరుగుతుంది. ప్రయాణికులు, సరుకుల రవాణా అంతరాయం లేకుండా సాగుతుంది.

విద్యుత్ రంగానికి సంబంధించి.. గాంగ్‌టక్‌లో విద్యుత్ ప్రసార, పంపిణీ నెట్‌వర్క్ అభివృద్ధి, నవీకరణ, పునరుద్ధరణ పనులను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం తొలగి ఎంతో బలోపేతమవుతుంది.

పట్టణాభివృద్ధి, పరిపాలన మౌలిక సదుపాయాల్లో భాగంగా.. గ్యాంగ్‌టక్‌లోని లువేప్స్ వద్ద జనసేవా సచివాలయం (మినీ సెక్రటేరియట్), సివిల్ సర్వీస్ అధికారుల సంస్థను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. వీటితోపాటు లింగ్డింగ్‌లో సిక్కిం అర్బన్ గరీబ్ ఆవాస్ యోజన, పోలీసు సిబ్బంది కోసం గృహ సముదాయాలు, ఎన్ఏపీ - పాంగ్‌థాంగ్ వద్ద గ్రేడ్ 'సి' క్వార్టర్ల వంటి గృహ నిర్మాణ ప్రాజెక్టులను కూడా ఆయన ప్రారంభిస్తారు. అంతేకాకుండా ఎంజీ మార్గ్‌లో సద్భావ మండపం నిర్మాణానికి శ్రీ మోదీ శంకుస్థాపన చేస్తారు.

పర్యావరణ పరిరక్షణ చర్యలను తీసుకుంటే.. నదీ కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా సింగ్‌టమ్ పట్టణంలో మురుగనీటి వ్యవస్థ పునరుద్ధరణకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. గ్యాంగ్‌టక్‌లోని జోన్-ఎఎఎలో రోరో చూ నది ద్వారా రాణి చూ నదీ కాలుష్య నివారణ పథకాన్ని కూడా ఆయన ప్రారంభిస్తారు. మెరుగైన పట్టణ పారిశుధ్యం, సుస్థిర పర్యావరణ వ్యవస్థలకు ఇది దోహదపడుతుంది.

పర్యాటకం, పుణ్యక్షేత్రాల రంగంలో.. గాంగ్‌టక్‌లోని రిడ్జ్ ప్రిసింక్ట్ పునరుద్ధరణను, సోరెంగ్‌లోని డోడాక్‌లో పర్యావరణ హిత పర్యాటక, తీర్థయాత్రా మౌలిక సదుపాయాలను, 18వ మైలు- హాంగు సరస్సు వద్ద సదుపాయాలు సహా కైలాస మానస సరోవర యాత్ర కోసం మౌలిక సదుపాయాలను, నాంఫింగ్‌లోని కృష్ణ ప్రణామి మంగళ్‌ధామ్‌లో ఒక యాత్రి నివాస్‌ను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. గ్యాల్‌షింగ్ జిల్లా సిల్నాన్‌లో పర్యావరణ హిత పుణ్యక్షేత్ర సముదాయానికి కూడా ఆయన శంకుస్థాపన చేస్తారు.

రాష్ట్రంలో వ్యవసాయోత్పత్తుల ప్రాసెసింగ్‌ను బలోపేతం చేయడంతోపాటు రైతుల జీవనోపాధినీ, అన్ని దశల్లోనూ రాష్ట్రంలో ఆ రంగాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సిక్కిం ఇఫ్కో ప్రాసెసింగ్ ప్లాంటును ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. దీనితోపాటు యువతను ప్రోత్సహించడం, క్రీడారంగాన్ని అభివృద్ధి చేయడం కోసం పాక్యోంగ్ జిల్లా రంగ్‌పో (మైనింగ్) వద్ద ఇండోర్ క్రికెట్ సౌకర్యాలను కూడా ఆయన ప్రారంభిస్తారు. సిక్కిం రాష్ట్ర అవతరణ స్వర్ణోత్సవ సంవత్సరంలో ప్రధానమంత్రి పర్యటన ఒక కీలక మైలురాయిగా నిలవబోతోంది. సిక్కింతోపాటు మొత్తం ఈశాన్య భారత వేగవంతమైన, సుస్థిర అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఉన్న అచంచల నిబద్ధతకు ఇది నిదర్శనం.

# వ్యర్థాల నుంచి బయోగ్యాస్... రోజుకు 500కి పైగా భోజనాలను అందిస్తోన్న గుజరాత్ విద్యా సంస్థ

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 27:స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0 స్ఫూర్తితో గుజరాత్‌లోని గాంధీ నగర్‌లోని ఒక విద్యాసంస్థ సరికొత్త విప్లవానికి నాంది పలికింది. శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ ద్వారా ఇంధన స్వయం సమృద్ధిని, సుస్థిరతను ఎలా సాధించవచ్చో నిరూపించి అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

అడాలజ్ సమీపంలోని వసుమతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీమతి మానెక్‌బా వినయ్ విహార్ విద్యా సంస్థ.. వంట గ్యాస్ కోసం సంప్రదాయ ఎల్‌పీజీపై ఆధారపడటాన్ని పూర్తిగా నిలిపివేసింది. క్యాంపసులోనే వెలువడే వ్యర్థాలను వినియోగించుకుంటూ బయోగ్యాస్ ప్లాంటును ఏర్పాటు చేసి, దాని ద్వారా లభించే ఇంధనంతోనే ప్రతిరోజూ 500 మందికి పైగా భోజనం అందిస్తున్నారు. వసతి గృహంలో ఉంటున్న సుమారు 250 మంది విద్యార్థులకు రోజుకు రెండు పూటలా పౌష్టికాహారాన్ని ఈ బయోగ్యాస్ ద్వారానే వండుతున్నారు. అలాగే క్యాంపసులోనే నివసిస్తున్న 15 మంది సిబ్బంది కుటుంబాలకు కూడా ఈ భోజనమే అందుతోంది.

ఈ క్యాంపస్‌లో రోజుకు 90 క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్న రెండు బయోగ్యాసు ప్లాంట్లు పని చేస్తున్నాయి. ట్రస్టు ఆధ్వర్యంలోని గోశాలలో ఉన్న 222 ఆవుల నుంచి సేకరించిన పేడను ప్రధాన వనరుగా ఉపయోగిస్తున్నారు. దీనికి అదనంగా వంటగది వ్యర్థాలు, పొలాల్లో మిగిలిపోయిన వ్యవసాయ వ్యర్థాలను కూడా వినియోగిస్తున్నారు. ఈ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే బయోగ్యాస్‌తోనే సంస్థ మొత్తం వంట అవసరాలు తీరుతున్నాయి. దీని ద్వారా ఎల్‌పీజీ సిలిండర్ల అవసరం లేకుండా పోయింది.

"గుజరాత్ ప్రభుత్వ సంస్థాగత బయోగ్యాస్ ప్లాంటు పథకం కింద మేం వంటగ్యాస్ విషయంలో స్వయం సమృద్ధి సాధించాం. ఆవుల నుంచి వచ్చే పేడ ప్లాంటుకు సరిపడా ముడి పదార్థాన్ని అందిస్తోంది. గ్యాసు ఉత్పత్తి తర్వాత మిగిలే వ్యర్థ ద్రావణాన్ని మా పొలాల్లో ఎరువుగా ఉపయోగిస్తున్నాం. ఈ ప్లాంటు లేకపోతే మాకు ప్రతి నెలా సుమారు 30 ఎల్‌పిజి సిలిండర్లు అవసరమయ్యేవి. ఇప్పుడు ఆ అవసరం లేకుండానే వంటలు జరుగుతున్నాయి" అని అధికారులు తెలిపారు.

సేంద్రియ వ్యర్థాలు గాలి తగలని స్థితిలో కుళ్ళిపోవడం ద్వారా ఉత్పత్తి అయ్యే బయోగ్యాస్.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యంత ఆచరణాత్మకమైన, పొదుపైన, పర్యావరణ హితమైన వంట ఇంధనం. దీని వల్ల కేవలం ఇంధనమే కాకుండా, నైట్రోజన్ అధికంగా ఉండే ఈ ఉప ఉత్పత్తి ద్రవ పదార్థం.. సమర్థవంతమైన సేంద్రియ ఎరువుగా పనిచేస్తుంది. ఇది రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడమే కాకుండా, సాగు ఖర్చును తగ్గించి నేల సారాన్ని కాపాడుతుంది. ఇలా ఒక్క కార్యక్రమంతో అటు ఇంధనం, ఇటు ఎరువు అనే రెట్టింపు ప్రయోజనం లభిస్తోంది.

25 నుంచి 85 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం గల బయోగ్యాస్ ప్లాంట్ల కోసం గుజరాత్ ఇంధన అభివృద్ధి సంస్థ (జీఈడీఏ) ఆర్థిక సహాయం అందిస్తోంది. ముఖ్యంగా లాభాపేక్ష లేని సేవా సంస్థలకు 75 శాతం వరకు రాయితీ లభిస్తుండటంతో అనేక సంస్థలకు ఈ మార్పు ఆర్థికంగా ఎంతో సులభతరమైంది.

గత అయిదేళ్లలో గుజరాత్ వ్యాప్తంగా సుమారు 193 సంస్థగత బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఈ పద్ధతి ద్వారా కాలుష్య నివారణ, ఇంధన స్వయం సమృద్ధి, వ్యర్థాల నిర్వహణ, గోశాలలు, విద్యా సంస్థల నుంచి వెలువడే సేంద్రియ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వీర్యం చేస్తూ, సంపదగా మారుస్తోంది. ఈ విధంగా ప్రత్యామ్నాయ ఇంధన వనరులను పెంపొందించడంలో, స్థిరమైన అభివృద్ధిని సాధించడంలో గుజరాత్ రాష్ట్రం తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది.

స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0 ఆశయాలకు అనుగుణంగా చేపట్టిన ఇటువంటి కార్యక్రమాలు, సుస్థిర అభివృద్ధి దిశగా నగరాలు, విద్యాసంస్థలు ఎలా అగ్రగామిగా నిలుస్తున్నాయో ప్రతిబింబిస్తున్నాయి. వ్యర్థాల నిర్వహణలో వినూత్నమైన, సర్క్యులర్ విధానాలను అవలంబించడం ద్వారా పర్యావరణంపై పడే ప్రభావాన్ని తగ్గించడమే కాకుండా, వ్యర్థాలను ఒక విలువైన వనరుగా ఎలా మార్చుకోవచ్చో ఇవి నిరూపిస్తున్నాయి. స్వచ్ఛమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేయడం నుంచి సేంద్రియ పద్ధతులను ప్రోత్సహించడం వరకు, ప్రతి ప్రయత్నం దేశ నగరాలకు ఒక ఆచరణాత్మక మార్గాన్ని చూపిస్తోంది. శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, సమాజ భాగస్వామ్యం, ముందుచూపుతో కూడిన ప్రభుత్వ విధానాలు కలిస్తే.. పర్యావరణ హితమైన,పరిశుభ్రమైన, స్వయం సమృద్ధిని కలిగిన నగరాల నిర్మాణానికి ఇవి బాటలు వేస్తున్నాయి.

# బస్సు రూట్ చెప్పనందుకు.. వృద్ధుడ్ని చంపిన యువకుడు

చెన్నై, ఏప్రిల్ 27: బస్సులో పక్కసీటులో కూర్చొన్న వృద్ధుడ్ని రూట్ గురించి ఒక యువకుడు అడిగాడు. చెప్పేందుకు నిరాకరించిన ఆయనపై పిడిగుద్దులు కురిపించాడు. కుప్పకూలిన ఆ వృద్ధుడు కదులుతున్న బస్సులో మరణించాడు. తమిళనాడు రాజధాని చెన్నైలో ఈ సంఘటన జరిగింది. ఏప్రిల్ 26న గుడువంచేరి నుంచి వడపళనికి వెళ్తున్న మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) బస్సులో 74 ఏళ్ల చంద్రశేఖరన్ ప్రయాణించాడు. ఆయన పక్కసీటులో 25 ఏళ్ల అమర్‌నాథ్ కూర్చొన్నాడు.

కాగా, సిటీ బస్సులోని ఎల్ఈడీ స్క్రీన్‌పై కనిపిస్తున్న మార్గాన్ని చదవమని చంద్రశేఖరన్‌ను అమర్‌నాథ్ అడిగాడు. ఆ వృద్ధుడు అందుకు నిరాకరించాడు. బస్సు రూటు గురించి కండక్టర్‌ను అడగమని చెప్పాడు. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది.

మరోవైపు మాటల తీవ్రత పెరుగడంతో చంద్రశేఖరన్‌పై అమర్‌నాథ్ పిడిగుద్దులు కురిపించాడు. దీంతో కదులుతున్న బస్సులో ఆ వృద్ధుడు కుప్పకూలిపోయాడు. తోటి ప్రయాణికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మరణించినట్లు డాక్టర్ నిర్ధారించారు.

# ప్రజావాణికి తరలివచ్చిన ప్రజలు

- ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ .



సంగారెడ్డి, ఏప్రిల్ 27(నేటి నిజం ప్రతినిధి): ప్రజల సమస్యల పరిష్కారానికే "ప్రజావాణి" కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కు అర్జీలను అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి, ఒక్కొక్కరి సమస్యను నేరుగా తెలుసుకున్నారు. తక్షణం పరిష్కరించగలిగిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. మిగిలిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుండి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు.

విద్యార్థుల భద్రత, రక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొంటూ, మండల స్పెషల్ ఆఫీసర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాఠశాలలు ప్రారంభమైన తర్వాత జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలను ప్రతి వారం కనీసం రెండు సార్లు సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని, వసతి సౌకర్యాలపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు.

ప్రజావాణి కార్యక్రమంలో ప్రధానంగా రెవిన్యూ భూ సమస్యలు, హౌసింగ్, పంచాయతీ రాజ్, డి.డబ్ల్యూ.ఓ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, డిఆర్డీఏ, ఎక్సైజ్, ఉపాధి కల్పన, ఇరిగేషన్, విద్య, ఫిషరీస్, విద్యుత్ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు , అర్జీదారులు పాల్గొన్నారు.

# పశ్చిమ బెంగాల్‌లో రూ.510 కోట్లకు పైబడి జప్తు చేసిన మొత్తం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 27:భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ విధాన సభలకు సాధారణ ఎన్నికలు, ఉప ఎన్నికల షెడ్యూలును 2026 మార్చి నెల 15న ప్రకటించింది. ఆదర్శ ప్రవర్తన నియమావళి (ఎమ్‌సీసీ)ను ఖచ్చితంగా పాటించేటట్లు చూడాల్సిందిగా రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కమిషన్ ఆదేశాలిచ్చింది.

ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పాటు వాటి సరిహద్దు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యనిర్వహణ అధికారులు (సీఈఓలు), డీజీపీలు, ఇతర సీనియర్ అధికారులతో, నేర నియంత్రణ సంస్థల ప్రధానాధికారులతో కమిషన్ అనేక సార్లు సమీక్షా సమావేశాలను నిర్వహించింది. ఎన్నికల సందర్భంగా హింస, బెదరింపులు, ప్రలోభాల వంటివి చోటుచేసుకోకుండా చూడాల్సిందని వారిని ఆదేశించింది.

ఈ దిశగా, మొత్తం 2,728 కన్నా ఎక్కువ ఆకస్మిక తనిఖీ బృందాలను (ఎఫ్ఎస్‌టీస్) రంగంలోకి దించారు. ఫిర్యాదులను 100 నిమిషాల లోపల పరిష్కరించాలన్నదే ఈ చర్య వెనుక ఉన్న ఉద్దేశం. దీనికి అదనంగా, వేర్వేరు స్థానాల్లో ఆకస్మిక నాకాలను ఏర్పాటు చేశారు. 3,142 స్టాటిక్ సర్వేలెన్స్ టీములను (ఎస్ఎస్‌టీస్) కూడా మోహరించారు. దొంగసారా తయారీ, నిల్వ, పంపిణీకి వ్యతిరేకంగా ప్రత్యేక డ్రైవ్‌లను కూడా నిర్వహిస్తున్నారు.

ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎమ్ఎస్)ను 2026 ఫిబ్రవరి 26 నాటి నుంచి అమల్లోకి తీసుకువచ్చినప్పటి నుంచి 2026 ఏప్రిల్ 27 వరకు సమాచారాన్ని కింద పేర్కొనడమైంది.

# కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో ఎస్సీవో రక్షణ మంత్రుల సమావేశంలో భారత ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించనున్న రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో 2026 ఏప్రిల్ 28న జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) రక్షణ మంత్రుల సమావేశానికి భారత రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి భారత ప్రతినిధి బృందం హాజరుకానుంది. వివిధ సభ్య దేశాల రక్షణ మంత్రులు ఈ ప్రాంత రక్షణ, భద్రతకు సంబంధించిన పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. అంతర్జాతీయ శాంతి, ఉగ్రవాద నిరోధక చర్యలు, రక్షణ సహకారానికి సంబంధించిన అంశాలపై కూడా ఎస్సీవో సభ్య దేశాలు చర్చిస్తాయి.

పశ్చిమాసియా పరిస్థితుల కారణంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ గందరగోళం నేపథ్యంలో ఈ ఏడాది ఎస్సీవో సమావేశం జరుగుతోంది. ఈ ప్రాంత అతిపెద్ద రాజకీయ, ఆర్థిక సంస్థల్లో ఒకటైన ఎస్సీవోలో... ప్రస్తుత ఘర్షణ ప్రభావాన్ని తగ్గించే చర్యలపై చర్చించే అవకాశముంది.

ప్రస్తుత అంతర్జాతీయ భద్రతా సవాళ్ల నేపథ్యంలో... ప్రపంచ శాంతికి భారత్ కట్టుబడి ఉందని రక్షణ మంత్రి ఈ సమావేశంలో స్పష్టం చేస్తారు. ఉగ్రవాదాన్ని, తీవ్రవాదాన్ని ఎంతమాత్రమూ సహించబోమన్న భారత్ స్థిరమైన వైఖరిని వివరిస్తారు. సమావేశం సందర్భంగా... సమావేశంలో పాల్గొంటున్న వివిధ దేశాల రక్షణ మంత్రులతో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ద్వైపాక్షిక చర్చలు నిర్వహించే అవకాశముంది.

చైనాలోని షాంఘైలో 2001 జూన్ 15న స్థాపించిన ఒక అంతర్జాతీయ ప్రభుత్వాంతర్గత సంస్థ ఎస్సీవో. భారత్, రష్యా, కజకిస్థాన్, కిర్గిస్థాన్, పాకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, ఇరాన్, బెలారస్ ఇందులో సభ్యదేశాలు. భారత్ 2017లో ఇందులో పూర్తి స్థాయి సభ్య దేశంగా మారింది. ఏటా ఒక్కో దేశం అధ్యక్షత వహించే ఎస్సీవోకు 2023లో భారత్ అధ్యక్షత వహించింది.

# కోటి ఆశల గణాంకం.. రేపటి ప్రగతికి అంకురార్పణం

భారతదేశ పరిపాలనా ముఖచిత్రంలో జనగణన అనేది కేవలం అంకెల సమాహారం కాదు; అది ఒక దేశపు గతాన్ని విశ్లేషిస్తూ, వర్తమానాన్ని అంచనా వేస్తూ, భవిష్యత్తును నిర్మించే అత్యంత శక్తిమంతమైన శాస్త్రీయ ఆయుధం. ఒక దేశ ఆర్థిక పురోగతికి, సామాజిక న్యాయానికి, వనరుల సమతుల్య పంపిణీకి పునాదిగా నిలిచే ఈ ప్రక్రియ, మారుతున్న కాలంతో పాటు సాంకేతిక పరిమళాన్ని అద్దుకుంటూ సరికొత్త రూపును సంతరించు కుంటోంది. 1872లో ప్రయోగాత్మక పునాదులతో మొదలై, 1881 నుండి నేటి వరకు అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వస్తున్న ఈ దశాబ్దాల సంప్రదాయం, కోవిడ్-19 మహమ్మారి సృష్టించిన అనూహ్య విరామం తర్వాత 2027లో సరికొత్త 'డిజిటల్' అధ్యాయాన్ని ప్రారంభించ బోతోంది. ఈ నేపథ్యంలో, 2027 జనగణన అనేది భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక విప్లవాత్మక మలుపుగా, దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలవనుంది.

భారతదేశంలో జనగణన చరిత్రను అవలోకనం చేస్తే, బ్రిటీష్ పాలనా కాలంలో లార్డ్ మేయో హయాంలో 1872లో తొలి ప్రయత్నం జరగ్గా, డబ్ల్యూ.డబ్ల్యూ. హంటర్ నేతృత్వంలో 1881లో మొదటి సమగ్ర గణన నిర్వహించ బడింది. నాటి నుండి నేటి వరకు యుద్ధాలు, కరువులు సంభవించినా ఆగని ఈ ప్రక్రియ, 2021లో మాత్రం కరోనా సెకండ్ వేవ్ తీవ్రత కారణంగా వాయిదా పడక తప్పలేదు. దాదాపు 150 ఏళ్ల చరిత్రలో ఇలాంటి విరామం రావడం ఇదే తొలిసారి. అయితే, ఈ ఆలస్యం దేశ ప్రణాళికా రచనపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికీ 2011 గణాంకాలపైనే ఆధారపడి సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఈ సుమారు 15 ఏళ్ల అంతరంలో దేశ జనాభా నిర్మాణం, పట్టణీకరణ వేగం, అక్షరాస్యత నమూనాలు సమూలంగా మారి పోయాయి. అందువల్ల, 2027లో జరగబోయే గణన ఆ పాత వివరాలకు, నేటి వాస్తవాలకు మధ్య ఉన్న భారీ అంతరాన్ని పూరించే వారధిగా మారుతుంది.

ఈసారి జరగనున్న గణనలో అత్యంత వినూత్నమైన మరియు ప్రతిష్టాత్మకమైన అంశం 'స్వీయ గణన' (రావశ్రీట-ఇనిబీఎవతీజీబితినీని). డిజిటల్ ఇండియా సఫలీకృత మవుతున్న తరుణంలో, పౌరులు తమ వివరాలను తామే నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించడం ఒక గొప్ప ప్రజాస్వామ్య సంస్కరణ. గతంలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించేవారు. దీనివల్ల భాషా సమస్యలు, సమాచార సేకరణలో పొరపాట్లు, సమయాభావం వంటి ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ విప్లవం పుణ్యమా అని, ప్రభుత్వం కేటాయించిన ష్ట్రబిబిజూబ:/ /బవ.ఇవనిబబీబ.ణనీల.తిని పోర్టల్ ద్వారా ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల విద్య, వృత్తి, ఆదాయం, నివాస స్థితిగతులను పారదర్శకంగా నమోదు చేయవచ్చు. మే 10వ తేదీ లోపు ఈ స్వీయ నమోదు ప్రక్రియను పూర్తి చేసి, పొందిన ప్రత్యేక ఐడీని భద్రపరుచు కోవడం ద్వారా, తర్వాత వచ్చే క్షేత్రస్థాయి సిబ్బందికి కేవలం ఆ సంఖ్యను చూపిస్తే సరిపోతుంది. ఇది దేశవ్యాప్తంగా లక్షలాది గంటల శ్రమను, కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఆదా చేయడమే కాకుండా, డేటా సేకరణలో ఖచ్చితత్వాన్ని గణనీయంగా పెంచుతుంది.

గణాంక పరంగా చూస్తే, 2011లో భారత జనాభా 121.08 కోట్లుగా ఉండగా, ప్రస్తుత అంచనాల ప్రకారం అది 140 కోట్లు దాటి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 2011లో అక్షరాస్యత 74.04 శాతం ఉండగా, నేడు అది 80 శాతానికి పైగా చేరుకున్నట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా స్త్రీ పురుష నిష్పత్తిలో వస్తున్న మార్పులు, గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు జరుగుతున్న భారీ వలసలు, పెరుగుతున్న మధ్యతరగతి జనాభా వంటి అంశాలు 2027 గణన ద్వారా స్పష్టమవుతాయి. ఈ డేటా లేకపోవడం వల్ల నేడు రేషన్ కార్డుల కేటాయింపు, గృహ నిర్మాణ పథకాలు, నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక అంశాల్లో కొంత అనిశ్చితి నెలకొంది. 2027 గణాంకాలు వెలువడిన వెంటనే, 2029 తర్వాత జరగబోయే పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనకు ఇది ప్రాతిపదికగా మారుతుంది, తద్వారా రాజకీయ ప్రాతినిధ్యంలో సమతుల్యత ఏర్పడుతుంది.

సాంకేతికతతో కూడిన ఈ ప్రయాణంలో సవాళ్లు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. భారతదేశం లాంటి భిన్నత్వంతో కూడిన దేశంలో 'డిజిటల్ విభజన' ఒక ప్రధాన సమస్య. పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ వినియోగం




అధికంగా ఉన్నప్పటికీ, మారుమూల గిరిజన ప్రాంతాల్లో, వెనుకబడిన గ్రామాల్లో ఇంటర్నెట్ లభ్యత, సాంకేతిక అవగాహన తక్కువ. వృద్ధులు, చదువుకోని వారు స్వీయ గణనలో పాల్గొనడం కష్టతరం కావచ్చు. ఇక్కడే ఎన్యూమరేటర్ల పాత్ర కీలకం కానుంది. స్వీయ గణన అనేది సంప్రదాయ పద్ధతిని పూర్తిగా తొలగించదు, కానీ దానిని సులభతరం చేస్తుంది. ఎవరైతే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేరో, వారి వద్దకు సిబ్బంది నేరుగా వెళ్లి వివరాలు సేకరిస్తారు. అలాగే, సేకరించిన డేటా భద్రత మరియు గోప్యత విషయంలో ప్రజల్లో ఉన్న ఆందోళనలను ప్రభుత్వం పటిష్టమైన సైబర్ భద్రతా చర్యల ద్వారా తొలగించాల్సి ఉంటుంది. మరోవైపు, వర్తమాన రాజకీయ సామాజిక కోణంలో 'కుల గణన' డిమాండ్ ఈసారి జనగణనకు మరింత ప్రాధాన్యతను తెచ్చిపెట్టింది. దేశంలోని ఓబీసీలు, ఇతర సామాజిక వర్గాల వాస్తవ సంఖ్యను తెలుసుకోవడం ద్వారానే 'జనాభా ప్రాతిపదికన వాటా' సాధ్యమని ఒక వర్గం వాదిస్తోంది. స్వతంత్ర భారత చరిత్రలో 1951 నుండి ఇప్పటి వరకు కేవలం ఎస్సీ, ఎస్టీల గణాంకాలను మాత్రమే సేకరిస్తున్నారు. ఈసారి కుల గణనను కూడా చేర్చాలన్న డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం దేశ సామాజిక గమనాన్ని మార్చివేస్తుంది. వనరుల పంపిణీలో అర్హులైన వారికి ప్రాధాన్యత దక్కాలంటే ఖచ్చితమైన కుల-ఆర్థిక గణాంకాలు అవసరమని విశ్లేషకులు భావిస్తున్నారు.

జనగణన అనేది కేవలం ప్రభుత్వానికి సంబంధించిన విషయం కాదు, అది ప్రతి పౌరుడి బాధ్యత. మనం ఇచ్చే ప్రతి చిన్న సమాచారం ఒక పెద్ద జాతీయ విధానానికి రూపకల్పన చేస్తుంది. 2027 జనగణన ద్వారా లభించే డేటా, భారతదేశం 2047 నాటికి 'వికసిత్ భారత్'గా ఎదగాలన్న లక్ష్యానికి ఇంధనంగా పనిచేస్తుంది.

పౌరులు తమ వివరాలను సులభంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం రూపొందించిన ప్రక్రియ అత్యంత సరళంగా, పారదర్శకంగా ఉంది. ఈ 'స్వీయ గణన' విధానంలో పాల్గొన దలచిన వారు మొదటగా అధికారిక వెబ్‌సైట్ ఓపెన్ చేసి తమ రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవాలి. అక్కడ కనిపించే క్యాప్చా కోడ్‌ను నమోదు చేసిన తర్వాత, కుటుంబ పెద్ద పేరు మరియు క్రియాశీలకంగా ఉన్న చరవాణి సంఖ్యను అందించాలి. ఇక్కడ పౌరులు ఒక ప్రాథమిక జాగ్రత్త వహించాలి; కుటుంబ పెద్ద పేరు ఒకసారి నమోదు చేసిన తర్వాత మార్చడానికి వీలుండదు. ఈ ప్రాథమిక నమోదు విజయవంతమైన తర్వాత, రెండో విభాగంలో పౌరులు తమకు అనువైన భాషను ఎంచుకోవచ్చు. భాషను ఎంపిక చేసుకోగానే మొబైల్ నెంబర్‌కు ఒక ఓటీపీ అందుతుంది. దానిని నమోదు చేసిన అనంతరం జిల్లా, పిన్ కోడ్, గ్రామం లేదా పట్టణం వంటి భౌగోళిక వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. సాంకేతికతను మరింత సమర్థవంతంగా వాడుతూ, నివాస ప్రాంతాన్ని ఖచ్చితంగా గుర్తించేందుకు 'రెడ్ మార్కర్' సదుపాయాన్ని కల్పించారు. దీని ద్వారా మ్యాప్‌లో మీ నివాసం ఎక్కడ ఉందో క్లిక్ చేసి నిర్ధారించుకోవచ్చు. మూడో విభాగంలో అసలైన గణన ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇక్కడ కుటుంబ సభ్యుల వివరాలు, వారి విద్య, వృత్తి, ఆదాయం మరియు నివాస స్థితిగతులకు సంబంధించిన సుమారు 33 కీలక ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. అన్ని వివరాలు నింపిన తర్వాత 'ప్రివ్యూ' ఆప్షన్ ద్వారా ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకోవాలి. తప్పులు ఉంటే సవరించుకుని 'ఫైనల్ సబ్మిట్' బటన్ నొక్కాలి. దీనితో మీ సమాచారం సర్వర్‌లో లాక్ అవుతుంది. అనంతరం మొబైల్ మరియు ఈ-మెయిల్‌కు 'ఊ' అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల విశిష్ట ఎస్ఈ ఐడీ (రాఇ ఎఆ) అందుతుంది.

ఈ ప్రక్రియ అంతటితో ముగిసి పోదు. నాలుగో విభాగంలో ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో మీ ఇంటికి వచ్చినప్పుడు, మీరు ఆన్‌లైన్‌లో పొందిన ఎస్ఈ ఐడీని వారికి చూపించాలి. వారు తమ వద్ద ఉన్న డిజిటల్ పరికరాల్లో ఆ ఐడీని నమోదు చేయగానే మీరు ఇచ్చిన వివరాలు కనిపిస్తాయి. మీరు తెలిపిన సమాచారం, వారు ప్రత్యక్షంగా గమనించిన అంశాలు సరిపోలితే ప్రక్రియ ముగుస్తుంది. ఒకవేళ ఏవైనా పొరపాట్లు ఉన్నా లేదా డేటా మ్యాచ్ కాకపోయినా, వారు తిరిగి కొత్తగా వివరాలను నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఈ ద్విముఖ ధృవీకరణ పద్ధతి వల్ల సమాచారంలో తప్పులు దొర్లే అవకాశం ఉండదు. స్వీయ గణన ద్వారా పారదర్శకతను పెంచుతూ, సాంకేతికతను జోడిస్తూ నిర్వహిస్తున్న ఈ మహా క్రతువు, భారత పరిపాలనా వ్యవస్థలో ఒక నూతన శకాన్ని ఆవిష్కరిస్తుంది. సమాజంలోని ప్రతి వర్గం ఈ ప్రక్రియలో భాగస్వాములై, సరైన సమాచారాన్ని అందించినప్పుడే దేశాభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయి వరకు చేరుతాయి. వనరుల కేటాయింపులో హేతుబద్ధత రావాలన్నా, విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో మెరుగైన ప్రణాళికలు రూపొందించాలన్నా ఈ గణాంకాలే ప్రాణాధారం. 2027 జనగణన కేవలం సంఖ్యల గణన కాదు, అది భారతదేశ భవిష్యత్ ప్రగతికి వేస్తున్న ఒక శాస్త్రీయ పునాది. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి, ఈ డిజిటల్ యజ్ఞంలో పాలుపంచుకోవడం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలి. అప్పుడే మనం కలలుగనే 'వికసిత్ భారత్' సాకారం అవుతుంది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ప్రక్రియ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని పౌరుడిని నేరుగా భాగస్వామిని చేయడం ఒక గొప్ప ప్రజాస్వామ్య విజయం. ఈ చారిత్రాత్మక మార్పుకు సాక్ష్యంగా నిలవడమే కాకుండా, సకల సమాచారాన్ని సద్వినియోగం చేసుకుని ప్రగతి పథంలో పయనించాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# గోరక్షకుల ముసుగులో చట్టాన్ని అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోండి..

## -సర్టిఫైడ్ జంతువులను మాత్రమే వారసంతల్లోకి అనుమతించండి
## -కలెక్టర్, సీపీ లకు ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ వినతి



కరీంనగర్, ఏప్రిల్ 27:(నేటినిజం ప్రతినిధి) గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, కావాలని దాష్టీకాన్ని ప్రదర్శించే వారిపై.. కఠిన చర్యలు తీసుకోవాలని.. ఈదుల్ అజ్హ బక్రీద్ పండుగ నిర్వహణకై సహకరించాలని, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో.. నగర ఇస్లామియ ధార్మిక పండితులు, ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులు సోమవారం కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రాకి, సీపీ గౌష్ ఆలం లను వారి కార్యాలయాల్లో కలిసి వినతిపత్రములు అందజేశారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు ఈ వినతి పత్రాలను అందజేసినట్లు గులాం అహ్మద్ హుస్సేన్ పేర్కొన్నారు. బక్రీద్ లో ఖుర్బానీ ఇచ్చే జంతువుల్లో ఆవులు, చిన్న చిన్న దూడలు వంటివి లేకుండా జాగ్రత్తలు వహించాలని.. వెటర్నరీ డాక్టర్లు ధృవీకరించిన సర్టిఫైడ్ జంతువులను మాత్రమే కొనుగోలు చేయాలని, వారసంతల్లో ఆవులు వెళ్లకుండా ఈ బక్రీద్ మాసం సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఖుర్బానీ కోసం ఆరోగ్య కరమైన జంతువులు ఉండేట్లు చూసుకోవాలని, చట్ట పరిధిలో ఉండి పండుగ జరుపుకోవాలని, చట్టాన్ని అతిక్రమించే పనులు చేయొద్దని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. జంతువులు రవాణా చేస్తున్నప్పుడు పోలీసులు ఆపితే వారికి సహకరించాలని, గోరక్షకుల ముసుగులో దుండగులు ఆపినచో తక్షణమే 100కు కాల్ చేయాలని, సమీపంలో ఉన్న పోలీసు స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు. గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే అల్లరి మూకలపై, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడిజిల్లాలోని పశువుల సంతల్లో వెటర్నరీ డాక్టర్లను అందుబాటులో ఉంచాలని, వెటర్నరీ డాక్టర్ల చేత సర్టిఫైడ్ చేయబడిన పశువులను మాత్రమే సంతల్లోకి అనుమతించాలని కోరారు. ఈఅంశంపై అన్ని పార్టీలతో కలిసి జిల్లా స్థాయిలో కలెక్టర్, సీపీ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో జమియతుల్ ఉలమా జిల్లా ఉపాధ్యక్షుడు ముఫ్తీ ఘియాస్ మొహియుద్దీన్, జిల్లా సున్నీ ఉలమా బోర్డు అధ్యక్షుడు మౌలానా అలీమోద్దీన్ నిజామీ, జమియత్ ఆహిలే హదీస్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సమీ, సదర్ ఖాజీ హాఫీజ్ మన్కబత్ షాఖాన్, సున్నీ మర్కజి మిలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, సిటీ జమియతుల్ ఉలమా ఉపాధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ రిజ్వాన్, ముఫ్తీ నదీమ్, హాఫీజ్ అస్గర్ అలీ, హాఫీజ్ అబ్దుల్ జబ్బార్, ఎంఐఎం కార్పొరేటర్లు ఇబ్రహీం, మాజిద్ హుస్సేన్, నాయకులు అసదుల్లా బేగ్, బాబుజానీ, లయన్ గఫ్ఫార్, లింగంపల్లి శ్రీనివాస్, అసిమ్, మజారోద్దీన్, గాలి రాజు, సురేశ్, అక్బర్ అలీ, వాజిద్ అలీఖాన్, సాజిద్, మెరాజ్, షబ్బీర్, ఖాలీద్, ఖదీర్ ఖాన్, కౌసర్ మజీద్ అధ్యక్షుడు డాక్టర్ యునూస్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్టు

కారేపల్లి, ఏప్రిల్ 27 : రాత్రుల్లో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగను ఖమ్మం సిసిఎస్, కారేపల్లి పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్ కు తరలించినట్లు కారేపల్లి ఎస్ఐ గోపి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వివరాలు వెల్లడించారు. ఖమ్మం ఖిల్లా బజార్ చెందిన ఎండీ.మతిన్ ఆరు కేసుల్లో ప్రధాన నిందుతుడని, కారేపల్లి పోలీస్ స్టేషన్ లో మూడు చోరి కేసులు నమోదు కాగా మధిర, బోనకల్, పెద్దపల్లి జిల్లాలో ఒక్కొక్క కేసు నమోదైనట్లు తెలిపారు. ఆయా కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టి నిందితుడిని కారేపల్లి ఆటో స్టాండ్ వద్ద దొంగను గుర్తించి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితుడి నుండి నుంచి సుమారు మూడు తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

# బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా సంటి మహేష్ నియామకం

## - రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రం అందజేత



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 27:(నేటనిజం ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా సంటి మహేష్‌ను నియమించారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆత్మకూరి కాంతికిరణ్ ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం కాంతికిరణ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డా. గౌతమ్ రావు సంటి మహేష్‌కు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కాంతికిరణ్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, ఆదర్శాలకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. నీతి, నిజాయితీ, నిబద్ధతతో క్రమశిక్షణ పాటిస్తూ సహచర కార్యకర్తలు, పార్టీ కమిటీలతో సమన్వయంగా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టి పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని సూచించారు. అన్ని వర్గాల్లో పార్టీ విస్తరణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సంటి మహేష్ మాట్లాడుతూ తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రతాప్ రామకృష్ణ, కుమ్మరి శంకర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డవేని గోపి, రేగుల మల్లికార్జున్, చంటి అంజిబాబు, చిక్కుడు మల్లేశం తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానని సంటి మహేష్ పేర్కొన్నారు.

# ఎరువుల కంపెనీ యాజమాన్యాల ఆంక్షలు నిలిపివేయాలని దుకాణాల బంద్

నల్గొండ, ఏప్రిల్ 27: ఎరువుల కంపెనీల యాజమాన్యాల తీరు వల్ల రైతులు, షాపుల డీలర్లు ఇబ్బందులు పడుతున్నారని, ఆంక్షలు విధించడం మానుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం తాండూర్ మండలంలో డీలర్లు సీడ్స్, ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ దుకాణాలను మూసివేసి నిరసన తెలిపారు.

మండల కేంద్రంలోని తాండూర్ ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫర్టిలైజర్ సంఘం మండల అధ్యక్షుడు బోనగిరి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బాలు ప్రసాద్ మారు, కోశాధికారి దత్తుమూర్తి, తాండూర్ మండల ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు మాట్లాడారు.

దేశ వ్యాప్తంగా నిర్వహించిన బంద్ లో భాగంగా డీలర్లు రైతుల సమస్యల పరిష్కారం కోసం తాండూర్ మండల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు దుకాణా లు స్వచ్ఛందంగా మూసివేసినట్లు తెలిపారు.

# అనుపురంలో బీఆర్ఎస్ జెండా రెపరెపలు

## - ఘనంగా 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 27:(నేటినిజం ప్రతినిధి): అనుపురం గ్రామంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ జడ్పిటిసి మేకల రవి మాట్లాడుతూ, తెలంగాణ అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందంజలో నిలిచిందని తెలిపారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముకలని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని పేర్కొన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతి ఇంటికి బీఆర్ఎస్ జెండాను చేర్చుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరమణారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## -మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 27:(నేటినిజం ప్రతినిధి): పిల్లల భవిష్యత్ పై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, చిన్నారుల భవిష్యత్తును ప్రత్యేక దృష్టి ... ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, బాల్య వివాహాలు లేని సమాజం కోసం కృషి చేయాలన్నారు.




పుల్కం రాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం వేములవాడ పట్టణంలోని 10 వార్డు అంగన్వాడీ కేంద్రంలో "బాలల భద్రత-రక్షణ-సంక్షేమం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు, వార్డు ప్రజలకూ పిల్లల రక్షణ, భద్రత, సంక్షేమం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ ... రుల భవిష్యత్తును ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు . ముఖ్యంగా విద్యార్థుల చదువు విషయంలో నిత్యం పర్యవేక్షణ ఉండాలని, పాఠశాలలో గురువులు నేర్పిన పాఠాలను వారు ఇంటికి వచ్చిన తర్వాత ఒకసారి అడిగి తెలుసుకోవాలని కోరారు. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలంటే కేవలం పాఠశాలలకే పరిమితం కాకుండా, ఉపాధ్యాయుల కన్నా తల్లిదండ్రులు ఎక్కువగా కష్టపడాలని ఆయన పిలుపునిచ్చారు. పిల్లల పట్ల సమాజంలో జరుగుతున్న అకృత్యాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, బాల్య వివాహాలు లేని సమాజం కోసం కృషి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పిల్లల ఆరోగ్య విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, వార్డ్ కౌన్సిలర్ సిరిగిరి సంగీత-శ్రీకాంత్ లతో పాటు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజాం, డిఎస్పీ శ్రీనివాసులు, పట్టణ సీఐ వీర ప్రసాద్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, అంగన్వాడీ టీచర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు, వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: BAISA DEVADAS.